# కూచిమంచి తిమ్మన

## పీఠిక

*వేదము వేంకటకృష్ణశర్మ - శతకవాఙ్మయసర్వస్వము, 1954*

శ్రీనాథుని తరువాత 18వ శతాబ్దారంభమునఁ బెక్కు గ్రంథములను వ్రాసి, సమకాలికులచేత మెప్పుపొంది ప్రభుదత్త "కవిసార్వభౌమ" బిరుదము వహించిన మహాకవి యీ కూచిమంచి తిమ్మనార్యుఁడు (క్రీ॥ శ॥ 1690-1760).

"హాటకగర్భవధూలీలాటనచలితాంఘ్రినూపురారావ శ్రీ-

పాటచ్చరములు, తేనియతేటలు మా కూచిమంచి తిమ్మయ మాటల్"

అని, సమకాలికుఁడును, విద్వత్కవీంద్రుఁడునగు ఏనుఁగులక్ష్మణకవిచేఁ గొనియాడఁబడిన యీ కవిలోకగ్రామణి పాండితీప్రతిభయుఁ, గవితాప్రజ్ఞయు నలోకసామాన్యములని వేఱుగఁ జెప్పవలయునా? ఇతఁడే కాఁడు; 'కూచిమంచి' వంశస్థులందఱును బండితులు, కవులుగఁ గన్పట్టుచున్నారు.

"మునుపు మాకీపె భల్లాణుఁడనెడి ఱేని కతయు, రుక్మిణి పెండిలికతయు, బొబ్బ

మెకపు గుబ్బలి కతయు, మేల్మిఱ నీలపెండ్లి కతయును గబ్బము ల్పేర్మిఁ గూర్చి!"

అని "అచ్చతెలుఁగు రామాయణము"నను

"ప్రతిభమై రుక్మిణీపరిణయంబును, సింహశైలమాహాత్మ్యంబు, నీలపెండ్లి

కథయును, రాజశేఖరవిలాసంబును, నచ్చతెనుంగు రామాయణంబు,

సారంగధరనృప చరితంబు, సాగరసంగమాహాత్మ్యంబు, రంగుమీఱు

సకల సలక్షణసారసంగ్రహంబు నొనర్చి కృతులు మాపేర నంకితము చేసి"

అని "రసికజనమనోభిరామము"నను

"నెరవొప్ప రుక్మిణీపరిణయంబును, సింహశైలమాహాత్మ్యంబు, నీలపెండ్లి

కథయును, రాజశేఖరవిలాసము, నచ్చతెనుఁగు రామాయణంబు మొదలగు"

అని "సర్వలక్షణసారసంగ్రహము"నను

"ప్రౌఢిమై రుక్మిణీపరిణయంబును, సింహశైలమాహాత్మ్యంబు, నీలపెండ్లి

కథయును, రాజశేఖరవిలాసంబును, నచ్చతెనుంగు రామాయణంబు,

సారంగధరనరేశ్వర చరిత్రంబు, సప్తార్ణవసంగ మాహాత్మ్యకంబు,

రసికజనమనోభిరామంబు, లక్షణసారసంగ్రహమును, సర్పపుర స-

మంచిత క్షేత్రకథనంబు, మఱియుఁ బెక్కు శతకదండక సత్కృతుల్ ప్రతిభఁగూర్చి"

అని "శివలీలావిలాసము"నను పేర్కొనియున్నాడు. అతని కృతులలో 'శివలీలావిలాసము' కట్టకడపటిదిగాఁ గనఁబడుచున్నది. ఏల యనఁగా, నందులోఁ దాను వ్రాసిన గ్రంథముల నన్నింటిని తెలిపియున్నాడు. పైఁగా, దేనిలోను దడవని తనశతకములగూర్చి

శివలీలావిలాసములో సూచనప్రాయముగాఁ జెప్పినాఁడు. వాని పేరులు తెలుపలేదు. శతకదండకసత్కృతుల్ అనినందువలన నవి రకమున కొకటికి మించియుండవలయును.

తిమ్మకవి తాను వ్రాసిన ప్రతికృతిలోను దద్రచనాకాలమును సూచించి విమర్శకలోకమున కొకింత మేలు చేసెను. ఈ క్రింద నతఁడేయే గ్రంథముల నెప్పుడు వ్రాసినది తెలుపు పట్టికను బరిశీలించినచో నతని కాలము సులభముగ నూహింపవచ్చును.

రుక్మిణీ పరిణయము శా.శ. 1637 క్రీ.శ. 1716

సారంగధర చరిత్రము శా.శ. 1651 క్రీ.శ. 1729

భర్గ శతకము శా.శ. 1651 క్రీ.శ. 1729

సర్వలక్షణసారసంగ్రహము శా.శ. 1662 క్రీ.శ. 1740

రసికజనమనోభిరామము శా.శ. 1672 క్రీ.శ. 1750

సర్పపురీ మాహాత్మ్యము శా.శ. ? క్రీ.శ. 1754

శివలీలా విలాసము శా.శ. ? క్రీ.శ. 1756

సింహాచల మాహాత్మ్యము ? ?

నీలాసుందరీ పరిణయము ? ?

రాజశేఖర విలాసము ? ?

అచ్చతెలుఁగు రామాయణము ? ?

కుక్కుటేశ్వర శతకము ? ?

రెండుమూఁడు తప్పఁ బై గ్రంథములలో నన్నియు ముద్రితములే. కడపటి యైదింటి రచనాకాలము తెలియవచ్చుట లేదు. “కుక్కుటేశ్వరశతక” మసమగ్రము. (92 పద్యములే కలవు.) కాని తన ప్రతికృతిలోను కవి స్వయముగాఁ దాను వ్రాసిన గ్రంథముల నొకక్రమము ననుసరించి పేర్కొన్నాడు. అందులోఁ దొలిదైన ‘రుక్మిణీపరిణయమే’ యతని మొట్టమొదటి కృతి. అది క్రీ.శ. 1716 సం॥రమున సాగినది. ఆ తరువాత (1) సింహాచలమాహాత్మ్యము, (2) నీలాసుందరీ పరిణయము, (3) రాజశేఖర విలాసము యీ మూఁటిని వ్రాసినట్లు తెలిపినాఁడు. కాని వాని కాలములు తెలుపలేదు. వీని తరువాత ‘సారంగధర చరిత్ర’ (ద్విపద), ‘భర్గశతకము’ రచించినట్లు చెప్పినాఁడు. ఈ రెండును లఘు కృతులే. వీని నిర్మాణకాలము క్రీ.శ. 1729. కాబట్టి క్రీ.శ. 1715-1729కు మధ్యగల 14 ఏండ్లలో పై మూఁడు కృతుల రచన జరిగియుండుననుటలో నేమాత్రము సందేహము లేదు. సారంగధర చరిత్ర వ్రాసిన క్రీ.శ. 1729కిని, సర్వలక్షణసారసంగ్రహము వ్రాసిన 1740కిని ఆ రీతిగనే మధ్యగల 12 ఏండ్ల వ్యవధిలో “నచ్చతెలుఁగు రామాయణ” కావ్యనిర్మాణము జరిగియుండును. దీనిని బట్టి కవి జీవితకాలమును గ్రహించుట కొంచెము సులభసాధ్యము.

‘రుక్మిణీ పరిణయము’ను వ్రాసిన (1715) కాలమునకు కవికి 25 యేండ్ల ప్రాయమైన నుండును. ఆ పక్షమునఁ దిమ్మన క్రీ.శ. 1690 సం॥ర ప్రాంతమున జన్మించినవాఁడనుట సమంజసము. అతని కడపటి కృతియయిన “శివలీలావిలాసము” క్రీ.శ.1756లో వ్రాయఁబడినది. కనుక నతఁడు దాదాపు 1760 ప్రాంతమువఱకు జీవించి యుండవలయును. ఈ నిర్ణయము సత్యమే యని రుజువు చేయుటకు మఱియొక యాధారము కూడ లేకపో లేదు. తిమ్మకవి-

> “రావు మాధవనృప పరిరక్షితంబు భోగనికరంబు పీఠికాపురవరంబు”

అని తాను “రుక్మిణీపరిణయము” వ్రాయు కాలమునకుఁ బీఠికాపురమునకుఁ ప్రభువైన పెద్ద మాధవరావును బేర్కొన్నాఁడు. ఇది 1715 నాఁటి రచన; కనుక నతఁడు ప్రభువుల దృష్టి కెక్కునంత ప్రౌఢుఁడుగా నుండియుండఁడు.

కాని 1760 లో రచించిన ‘రసికజనమనోభిరామము’లో

“రావు నీలాద్రిమాధవరాయ నృపతిచేతఁ గవిసార్వభౌమ విఖ్యాత బిరుద

మందిన ఘనుండఁ, దిమ్మయాహ్వాయుఁడ”

నని చెప్పినాఁడు. దీనినిబట్టి యీ నీలాద్రిమాధవరాయనృపతి నీలాద్రిరాయణింగారి మనుమడయిన చిన్న మాధవరాయణింగారనియు, నితఁడు వేంకటకృష్ణారాయణింగారికిఁ దరువాత ననఁగా 1759లోఁ బ్రభుత్వమునకు వచ్చినాఁడనియుఁ దెలియుచున్నది. అట్టి సందర్భములోఁ, దిమ్మకవి తాను 1750లో వ్రాసిన రసికజనమనోభిరామములో 1759లో వచ్చిన ప్రభువు కవిసార్వభౌమబిరుద మిచ్చినాఁడనుట పొసఁగునా! ఏల పొసఁగదు? బిరుదమిచ్చుటకుఁ, బరిపాలనము సేయు రాజే యయి యుండవలయునను సిద్ధాంత మెక్కడను లేదుకదా! యువరాజై న నందుల కర్హుఁడే కదా! తిరుపతి వేంకటకవులు వేంకటగిరిసంస్థానమునకు పెడలినప్పుడు ముందుగా సత్కరింపఁబడినది, యప్పటి యేలికయగు శ్రీరాజగోపాలకృష్ణయాచేంద్రులవారివలన కాదనియు, వారి సోదరులగు ముద్దుకృష్ణయాచేంద్రులవారిచేత గౌరవింపఁబడిరనియు వారి ‘నానారాజసందర్శనము’ వలనఁ దెలియుచున్నది. కనుక చినమాధవరాయణింగారివలన తిమ్మకవియు బిరుదము పొంది యుండుటలో నసంభవ మేమియు లేదు. (ఏలిక కాకున్నను) యువరాజైనవానికి నంతమాత్ర మధికారముండి యుండుననుట బేసబబు కాదు.

తిమ్మకవియెడల (అతని కాలమునకు) సంస్థానాధిపతులయిన దొరలకెల్ల సమానగౌరవప్రతిపత్తు లున్న ట్లతని రచనలన్నిట వారిని బేర్కొనుటచేతనే సూచితమగుచున్నది. తన రుక్మిణీపరిణయములో పెద్దమాధవరాయణింగారిని, సారంగధర చరిత్రలో వేంకటకృష్ణారాయణింగారిని, రసికజనమనోభిరామములో నీలాద్రి (చిన్న) మాధవరాయణింగారిని పేర్కొన్నాఁడు. ఈ ముగ్గురిలోను మొదటి యిద్దఱకంటె మూఁడవవారే యెక్కువ రసికులుగను, నెక్కువ సన్నిహితులుగను నుండి, కవిగారి నాదరించి, సత్కరించి, బిరుదమిచ్చి యుందురనుటలో సందేహము లేదు. పైగా నీ ప్రభునియొక్కయుఁ, గవిసార్వభౌముని యొక్కయు వయస్సులలో నట్టే తేడా కనబడుట లేదు. సమకాలికులు, సరసులయిన వీరిరువురి సమకాలికత్వము ప్రభువు సాహిత్యపోషణకును, కవియొక్క కవితాప్రతిభాప్రకటనకును తగిన యవకాశము కలిగించినది. కనుకనే, కవి యందలి తన గౌరవమును సూచించుటకు చినమాధవరావు “సార్వభౌమ” బిరుద మతని కనుగ్రహించినాఁడు.

తిమ్మకవి తన కులగోత్రాదికములనుగూర్చి తన కృతులలో వివరముగా వ్రాసికొనినాఁడు-

ఇతఁ డాఱువేల నియోగి బ్రాహ్మణుఁడు. కౌండిన్యసగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. లచ్చమ గంగనల జ్యేష్ఠపుత్రుఁడు. ఇతని తాత కూడ తిమ్మన నామాంకితుఁడే. ముత్తాత బయ్యన. జగ్గన్న, సింగన్న, నరసన్న లితని పినతండ్రులు. వీరమ్మ, పాపమ్మలు మేనత్తలు. సింగన్న, జగ్గన్న (జగన్నాథకవి), సూరన్నలు తమ్ములు. ఇతని సతీతిలకము గొట్టుముక్కుల రామయమంత్రి కూతురైన బుచ్చమాంబ.

తిమ్మకవి తన రసికజనమనోభిరామములో

“నిఖిలవిద్యాభ్యాసనిపుణుఁడు మత్సహోదరుఁడగు జగ్గసత్కవితనయులు

ఘనులు తిమ్మనయు, సింగనయును లేఖకపాఠకులై కృతుల్ ప్రబలఁ జేయ”

అని చెప్పుకొనుట చేత నితనికి సంతానము లేదని యూహింపవలసియున్నది. జగ్గన్న కుమారులను మాత్రమే పేర్కొనుట చేతఁ దక్కిన యిద్దఱికిఁ గూడ నప్పటివఱకు బిడ్డలు లేరనియే తోఁచుచున్నది. తిమ్మకవిమీఁద నతని తమ్ములకుఁ, దమ్ముని కుమారులకు నమితగౌరవమున్నట్లు తెలియుచున్నది. జగ్గకవి యితనినిగూర్చి తన కృతులలోఁ బ్రశంసించిన యీ క్రింది వాక్యములవలన నది రుజువగుచున్నది.

"మానితానూనాసమాన నానావిధవంగత్రిలింగద్రవిడదేశభాషావిశేష భూషితాశేషకవితావిలాస భాసురాఖర్వ
సర్వలక్షణసారసంగ్రహోద్దామరామాయణాది ప్రముఖబహుళప్రబంధనిబంధబంధురవిధాన
నవీనశబ్దశాసనబిరుదాభిరామ తిమ్మకవిసార్వభౌమ"

*(చంద్రరేఖావిలాప గద్య)*

"రకపుం గావ్యకళాకలాపరచనా ప్రాగల్భ్యసంసిద్ధికై,
ప్రకటప్రేమ భజింతు నీశమకుటప్రస్ఫీతగంగాజలా-
ధికమాధుర్యాకవిత్వ ధూర్వసధియౌ దివ్యప్రభావాఢ్యుఁ ది-
మ్మకవిశ్రేష్ఠు, మదగ్రజు మదిని రామా భక్తమందారమా"

*(భక్తమందారశతకము)*

ఇతఁడు రుక్మిణీపరిణయములోఁ దప్పఁ దక్కిన తన యన్ని కృతులలోను "దెందులూరి లింగనారాధ్యుని" తన గురువని స్తుతించుటచేత రుక్మిణీపరిణయ రచనాకాలమునాఁటి కతనికి గురువుగారి యాశ్రయము కలుగలేదని యేర్పడుచున్నది. తద్రచనాకాలము క్రీ.శ. 1715. ఆ తరువాత క్రీ.శ. 1729 సం॥ అతఁడు సారంగధర చరిత్రలో

"శ్రీకరగుణసార చిరశుభాకార, నాకధునీజార నవసుకుమార
అలఘుతేజోనిధి యగు దెందులూరి కులు లింగనాగాధ్య గురుని నుతించి"

యనియు, భర్గశతకములో

"చిరభక్తి న్మదిలో భవద్వ్రతముగా జింతింతు నశ్రాంతమున్
బరవాదిప్రమదద్విపేంద్రపదవీపంచాననశ్రేష్ఠు బం-
ధురతేజోనిధి, దెందులూరి కులపాథోరాశి రాకానిశా-
కరునిన్ లింగయసద్గురూత్తముని భర్గా పార్వతీవల్లభా"

అనియుఁ జెప్పుటవలన దెందులూరి లింగనారాధ్య గురుత్వము 1715-1729 సంవత్సరముల మధ్య యెప్పుడో యతనికి లభ్యపడి యుండవచ్చును. ఈ గురూపదేశము పొందుటకు ముందు తిమ్మకవి, తాను రచించిన రుక్మిణీపరిణయములోఁ దక్కిన కృతులలోవలె సతీసహితముగాఁ ద్రిమూర్తులను గణాధిపుని మాత్రమే కాక, యాంజనేయ, వైనతేయ, నవగ్రహాదులనుగూడ స్తుతించుట చేత వైష్ణవపక్షపాతముగల యద్వైతిగనే కనిపించును.

నియోగులలోఁ బ్రాఙ్నాటివారనియు నార్వేలవారనియు రెండు ప్రధానశాఖలున్నవి. అందులో మొదటిది తిర్యక్పుండ్రాది శైవప్రముఖాచారముగా, రెండవది యూర్ధ్వపుండ్రాది వైష్ణవప్రసిద్ధాచారపరముగా వ్యవహరించుచుండినను రెండు నద్వైతమతమునే యవలంబించి, శాంకరగురుపీఠమునకే యంకిత మైయుండుట యందఱి కెఱుకపడిన విషయమే. ఒక్క గోల్కొండవ్యాపారిశాఖ మాత్రమే విశిష్టాద్వైతమతము నవలంబించినది. ఇఁక నార్వేలశాఖవారు శివకేశవభేదము లేని శుద్ధాద్వైతులైనను, నామములు ధరింతురు. ఈ యార్వేలశాఖవారిని గూర్చి కంకంటి పాపరాజు చెప్పిన విషయములన్నియు నక్షరముల నిజము. ఆనాఁటి కవులందఱు నూటికి డెబ్బదియైదుగురు ఆర్వేలవారే. (ఇఁక నిప్పుడున్నవారి మాటయో) - అది విషయాంతరము.

ఆర్వేలశాఖవాఁడయిన మన కూచిమంచి తిమ్మకవి యద్వైతమతావలంబకుఁడై యుండియు,

"దెందులూరి లింగనారాధ్యదేశికేంద్రదత్త మాహేశ్వరాచారవృత్తిరతుఁడ"

అనుటచేత శుద్ధశైవమతము నవలంబించినట్లు తోఁచుచున్నది. లింగన యారాధ్యబ్రాహ్మణుఁడని పై పంక్తులే చెప్పుచున్నవి. అనఁగా లింగధారణము కలిగిన వీరశైవుఁడని వేఱ చెప్పనక్కఱలేదు కదా! అయిన నతని శిష్యుఁడగు మన తిమ్మకవి (శుద్ధ) శైవము నవలంబించి యుండవచ్చును. కాని వీరశైవాచారపరుఁడు మాత్రము కాఁడు. లింగన శిష్యత్వముచేత, నాంజనేయ వైనతేయాది భక్తస్తుత్యాదులు దగ్గినవి. కాని, త్రిమూర్తులమీఁద నతనికిఁగల భక్తి సమానమే. ఇక్కడ మఱొక విశేషము- చిన్ననాటినుండి యతని శివభక్తి యతివేలము. అందునను పీఠికాపుర కుక్కుటేశ్వరుఁ డతని యిష్టదైవము. అందుచేతనే (సర్పపురీమాహాత్మ్యము తప్ప) తన గ్రంథములన్నియుఁ గుక్కుటేశ్వరునకే యతఁ డర్పించినాఁడు.

ఇతఁడు పీఠికాపుర సంస్థానములోఁ జేరిన 'కందరాడ' గ్రామములో నుండువాఁడనని, సర్వలక్షణసారసంగ్రహములోను, శివలీలావిలాసములోను స్పష్టపఱచినాఁడు. కాని సారంగధరచరిత్రలో మాత్రము, తన్ను గూర్చి చెప్పుకొనుటలో "పావన కంద్రాడ పట్టణాధిపుని" యని పొగడుకొనినాఁడు. దీనినిఁబట్టి సారంగధరచరిత్ర రచనాకాలమునకు (క్రీ.శ. 1729) అతఁడా గ్రామకరణీకమును సర్వాధికారములతో ననుభవించుచుండినాఁడనుట సత్యము. అయిన, సర్వలక్షణసారసంగ్రహము వ్రాసిన క్రీ.శ. 1740 సం॥రమునకుఁ దర్వాత నా యుద్యోగమును దన తమ్ముండ్రకో, జగ్గకవి కుమారులకో యప్పగించి, సాహిత్యకవిత్వవిచారములతోఁ దాను కాలము గడపియుండును. అనఁగా నప్పటికే తిమ్మకవి వయస్సు అఱువదియవ పడిలోఁ బడియుండుట చేత "లేఖకపాఠకులు"గా జగ్గకవి కుమారుల సహాయ మపేక్షించుచు (రసికజనమనోభిరామము చూడుఁడు) నున్నవాఁడు కరణీకమును నిర్వహించుట కష్టమయి వారికే యొప్పగించినాఁడనుట సహేతుకమే. కనుక క్రీ.శ. 1729 నాఁటికి కంద్రాడ పట్టణాధిపుఁడైన తాను 1740 నాఁటికి కందరాడ మందిరుఁడైనాఁడు.

పైఁగాఁ దాను స్వతంత్రముగా వ్రాసిన కుక్కుటేశ్వర, భర్గ శతకములలో రాజులను, వారి ప్రవర్తనములను గూర్చి యుపాలంభించుటకుఁ, దన కరణీకవృత్తి ప్రతిబంధకముగా నుండునేమో యను నూహచేతఁ గూడ దానిని వదలియుండవచ్చును. పోషకులయిన పీఠికాపుర ప్రభువులను దన గ్రంథములలోఁ గాఁచిత్కముగా సూచించి తన ప్రభుభక్తిని లాంఛనప్రాయముగాఁ దెలుపుకొనెనే కాని, యే ప్రభువునకైన నొకకృతినైన నంకితము చేయలేదు. వారు నతని మహాకవిగా నంగీకరించి 'సార్వభౌమ' బిరుదముతో గౌరవించిరి. కాని తమ పేర కృతి రచింపవలసినదని యెప్పుడును గోరినట్లు కనఁబడదు. తిమ్మకవి జీవితములో నుండు నీ యద్భుతసన్నివేశము మఱి యే కవిజీవితములోను లేదు. "ప్రభువు - ఆశ్రితుఁడు" అను నంతస్తులలోఁగాక, స్వతంత్రవృత్తి గల పాలకపాలిత భావముతో సమానఛాయాలో పీఠపురాధీశ తిమ్మకవిసార్వభౌముల కాలము గడచినది. అవసానకాలములో నతఁడు చంద్రమపాలెము చేరినట్లు తెలియుచున్నది.

ఇతనికి "కవిసార్వభౌముఁడు" అను చినమాధవరాయ ప్రదత్తబిరుదమేకాక, "నవీనశబ్దశాసన" బిరుదముకూడ నున్నట్లు జగ్గకవి "చంద్రరేఖావిలాపము"వలనఁ దెలియుచున్నది. బహుశా యీ బిరుద మతని "సర్వలక్షణసారసంగ్రహ" రచనము తరువాత విద్యత్కోటి యనుగ్రహించి యుండవచ్చును. కాని యీ బిరుదమునుగూర్చి తాను, స్వరచిత గ్రంథములలో దేనియందును చెప్పలేదు.

తిమ్మకవిసార్వభౌముఁడు వశ్యవాక్కు. సంస్కృతాంధ్రములలో సమాన పాండిత్యము కలవాఁడు. అచ్చికశబ్దములతో నిరాఘాటముగా కవిత్వమును 'కదం' తొక్కింపఁగల యుద్దండుఁడు. అతని కావ్యములలో నర్థాలంకారములకంటె శబ్దాలంకారములు ప్రాధాన్యము వహించును. లక్షణానుసరణమైన కవిత్వమును సాగించుటలో శ్రీనాథుఁడు. ఆ కాలమున సంస్థానాధిపతులు, పండితులు మొదలయిన వారందఱు నతనిని గౌరవప్రపత్తులతోఁ జూచువారు. కవు లతని గ్రంథములను ప్రామాణికములుగా నంగీకరించువారు. రాజులయెడఁ దిమ్మకవి గౌరవము చూపువాఁడే; కాని వారి ప్రవర్తనల మాత్రమంతగా మెచ్చుకొనువాఁడు కాఁడు. పైగా

నీసడించువాఁడు. ఆకారణము చేతనే వారికి గ్రంథములను గృతి యీయలేదు. ఈ విషయమున నీతఁడు బమ్మెర పోతరాజునకుఁ దుల్యుఁడైనను నీయిరువురి నరాంకిత విముఖత్వములో భేదము లేకపోలేదు.

పోతన రాజులను "మనుజేశ్వరాధము" లన్నాఁడు. "సద్ద్విజశ్రేయమై" అని ద్విజులను మాత్రము "సద్ద్విజు" లన్నాడు. ఇందులోఁ గటువైన పరనింద, ఆభిజాత్యసూచకమైన యాత్మస్తుతి యున్నవి. ఇట్టి భావములు తిమ్మకవికి నున్నవి; కాని యంత పెడసరముగా (శతకములలోఁ దప్ప) నతని కృతులలో నంతగాఁ గనిపింపవు. అందుకుఁ గారణము లేకపోలేదు. వ్యవసాయము స్వయముగాఁ జేసికొనుచు బ్రతుకు నిరుపేద రైతయిన బమ్మెరపోతన, పాలకుల వలన బాధ లనుభవించినాఁడు. కవిసార్వభౌముఁ డట్లు కాక, "కందరాడ" పురాధీశుఁడై గ్రామవ్యవహారములన్నియుఁ దన యదుపులో నుంచుకొని ప్రభువుల గౌరవమును సంపాదించుకొని జీవించినాఁడు.

నరులకుఁ గృతినర్పించుటకుఁ దన యసమ్మతిని జూపిన పోతన

"హాటకగర్భురాణి నిను నాఁకటికిం గొనిపోయి, య-
ల్ల కర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ"

అని ప్రభువుల యెడలఁ దనకుఁగల ద్వేషభావమును బూర్తిగ వెల్లడించినాఁడు. తిమ్మకవి కూడ

"వినుమఖిలేశ, మర్త్యులకు వేడుకఁ గావ్యమొసంగి, ధాత్రిపై
నొనరఁగ సౌఖ్యసంపదల నుద్ధతులై సుకవీంద్రులుందురు"

అనియు,

"పనిఁబూని తుచ్ఛభోగంబునకై కొఱగాని జనులఁ బొగడుటయెల్లన్
గనుఁగొన నిహపరదూరంబని తలఁచి వినిర్మలాంతరంగుండగుచున్"

*(రాజశేఖర విలాసము)*

అనియు చెప్పినాఁడు. అంతియకాక తన రసికజనమనోభిరామములో

"నరవరులిడు మణిభూషాకరితురగాందోళికాది ఘనవిభవము లస్థిరము లవేటికి"

అని యన్నాఁడు. ఈ విధముగా రాజులను, వారికిఁ గవుల విషయములోఁగల యలక్ష్యభావమును, వారి త్యాగములను గూర్చి యితఁడు తన కుక్కుటేశ్వర, భర్గ శతకములలో మఱియు దీవ్రముగా విమర్శించుటతో బాటు వారి ననుసరించు పండితులనేగాక, కవులనుగూడ నిరసించి పలికినాఁడు. దానినిగూర్చి మున్ముందు మనవి చేయుదును.

తిమ్మకవి కవితను దన యనుదినారాధ్యదేవతగా భావించి, తన కృతులకన్నిటికిఁ "గుక్కుటేశ్వరు"నే పతిగాఁ జేసినాఁడు. పూర్వకవుల ప్రయోగముల నొరవడిగాఁ బెట్టుకొని శబ్దౌచిత్య మెఱిఁగి, నిరాఘాటముగా, ధారాశుద్ధితోఁ గవిత్వము సాగించు శక్తి యితనితో నంతరించినట్లు ప్రాచీనపద్య వాఙ్మయచరిత్రకారుల యభిప్రాయము. ఆనాఁటి సిద్ధహస్తులయిన కవీంద్రులలో నగ్రగణ్యుఁడైన యీ తిమ్మన తన శివలీలావిలాసములో

"వినుఁ డీకృతి ముప్పదియొక దినములకుం జెప్పినాఁడ దేవుని యానన్"

అని చెప్పుటవలన, నొకనాటి కిన్ని పద్యములు రచింపవలయునను నియమము నవలంబించి గంగాఝరీసరణినిఁ బురుడించు ధారలోఁ బెక్కు లాచ్ఛికమిశ్రకావ్యములు వాణికిఁ దొడవులుగా దిద్దితీర్చుచుఁ దన జీవితమును గవితాసామ్రాజ్యపాలనకే యర్పించినట్లు తోఁచుచున్నది.

ఇతఁడు మహారసికుఁడు. ఇతని కావ్యములలోని శృంగారఘట్టములు రసికయౌవతయువతతుల కనురాగవర్ధనములు. కాని, దాని నాధారము చేసికొని, మనవారట్టి మహాకవుల జీవితములకుఁ గళంక మాపాదించు చిలిపికతలను గల్పించి చెప్పుట సర్వథా గర్హ్యము. అందు నీ తిమ్మకవిని గురించి యీ క్రింది కత పరంపరగా వచ్చుచున్నది:

ఇతని కావ్యములలోని శృంగారరసము నామూలాగ్రముగా గ్రహించి యానందించు విద్వత్కవయిత్రి యయిన యొక వారకాంత యతని సాహచర్యమునకుఁ దగిన యవకాశముకొఱకుఁ జూచుచుండఁగా నిర్జనమయిన యొక సందుమలుపులో నతఁ డొకనాఁడు హఠాత్తుగాఁ దటస్థపడినాఁడట! అప్పుడామె బలాత్కారముగా నతనిని గౌఁగలించుకొనినదఁట! అతఁ డట్టిసమయమున మోమావలకుఁ ద్రిప్పుకొనినాఁడట! అంతట నా గణికారత్నము-

"చతురులలోన నీవు కడుజాణవటంచును, నేను గౌఁగలించితి నిటు

మాఱుమోమిడఁగఁ జెల్లునే, యో రసికాగ్రణ్య!"

యనఁగా కవి వెంటనే

"అద్భుతమగునట్టి బంగరపుఁబొంగరపుంగవఁ బోలు నీ కుచద్వితయము

ఱొమ్ము నాఁటి యల వీపున దూసెనటంచుఁ జూచితిన్"

అని చెప్పెనఁట! ఇది కర్ణాకర్ణిగా వచ్చుచుండు కట్టుకథ యనుటకు సందియము లేదు. తిమ్మకవి రసికతాపరీక్ష కిదియా యుపాయనము? సందుమలుపా ప్రదేశము? ఎంత సిగ్గువిడిచినవారైన నిట్లు తమ గుడ్డిప్రేమను బ్రదర్శింతురా? విద్యావివేకములుగల నాయికానాయకుల కిట్టి రసాభాసపు నడివీధి శృంగార మంటఁగట్టి, వారి రసికత కిది తార్కాణమని పొంగిపోవు మేధావులు కుర్కురశృంగారక్రీడాప్రశంస చేయువారికంటె భిన్నులు కారు.

కొందఱీకథను ముక్కుతిమ్మనార్యున కంటఁగట్టుచున్నారు. దీని విశ్వసించువారు, పరిస్థితులను బట్టి, అతనికే యవకాశము లెక్కువ కాన, అదియే నిశ్చయమని తలంతురు. ఆ ప్రబంధయుగమున రసికలోకవరుఁడగు ముక్కుతిమ్మన సాంగత్యము గోరు గణిక సాహసించి (తెగఁబడి) ఆ మహానగరమున నేమూలనో తారసిల్లిన ముక్కుతిమ్మన విషయమున నట్లు ప్రవర్తించెననుట సందర్భశుద్ధికి లోటు గలిగింపదు.

నేఁటి మనవారెట్టి యపదూఱులు తిమ్మకవికేకాక, శ్రీనాథునికి, ధూర్జటికిఁగూడఁ గట్టిపెట్టిరి. కారణమేమన, శృంగారము తొణికిసలాడు నూతనభావోపేతములగు నా మహాకవీంద్రుల చాటువులు, వారి కావ్యములలోని పద్యములే! కవి హృదయమును బాగుగాఁ దరచి, వారి గంభీరభావముల నర్థము చేసికొనలేని యసమర్థులయిన విమర్శకులకు "కరిసంఘాదితపంచాయుధగేహ" లనిన బమ్మెర పోతనవంటి మహాభాగవతశిఖామణికూడ విటాగ్రణియే. రంధ్రాన్వేషణపరాయణుల సంకుచితదృష్టులు వారికి సహజములు కావచ్చును. కాని యవి సంఘమున కపకీర్తికరములు; లోకమునకుఁ బ్రమాదకరములు; చారిత్రక సత్యమునకు విపత్కరములు.

ప్రకృతిసిద్ధ మానవసౌందర్యమునకు యువతులు నిధులైనందున, వారి హావభావవిలాసవిభ్రమోపేత శృంగారమును మనవారు ప్రధానముగా స్వీకరించిరి. ఆ రసపోషణ లేకుండ కృతులు రచించుటయన, వారి దృష్టిలో "నేలవిడిచి సాము చేయుట" వంటిది. ఈ విషయమునఁ గొందఱి రచనలలో నే రవంత మోతాదు మించినట్లుండినను, వారెల్లరు దుర్వర్తనులనుట సాహసమే. అది సహింపరాని నేరము.

సహజసౌందర్యలీలావిలాసముగ మోహనలగు గ్రామవనితల నిష్కళంకకోమలరూపమహిమను గుర్తింపని నాయకులు, పుట్టుసౌందర్యము వెల్లడించు నవయవసౌభాగ్యము లేని పట్టణవాసికాంతాజన కల్పితాభరణాంబరశోభలను, స్నో, ఫేస్పౌడర్, లిప్‌స్టిక్కుల రంగులను, నసహజదృగ్గమనాదుల తళుకుబెళుకులను జూచి, వారే "యందాల రాణు"లని నిర్ణయించు నీ కాలములోని మనకుఁ బ్రాచీనకవుల శృంగార మవినీతిగను, వారు "పక్కా" విటరాజులుగను గనఁబడుటలో వింత లేదు.

కావున, తుచ్ఛభోగముల నాశించి, తన కృతులను, (అందుకొని సత్కరించు ప్రభువులుండియు) నరాంకితము చేయనొల్లక, లింగనారాధ్య గురూపదేశప్రాప్త పరమమాహేశ్వరవ్రతనిష్ఠాగరిష్ఠుఁడై, పారమార్థికబుద్ధితో జీవితము పవిత్రవంతముగాఁ గడపిన తిమ్మకవిసార్వభౌమునికి బరిహాసమున కయిన నఘు మంటఁగట్టుట మహాపచారమగును.

పదునెనిమిదవ శతాబ్దపు కవులలోఁ దిమ్మకవికిఁగల స్థానము మహోన్నతమైనది. అతని కావ్యములన్నియుఁ, దత్పూర్వకవుల మార్గములోననే నడచినను, గొన్నింటిలో నూతనత్వము లేకపోలేదు. 'రసికజనమనోభిరామ' రచనలోని యభూతకల్పనలు, నష్టాదశవర్ణనలు, ప్రాచీనప్రబంధముల ఫక్కిలోనే నడచినది. అంతవఱకుఁ బ్రబంధముల ధోరణులతోఁ దలవాఁచి, మొగము మొత్తిన రసికజనులకు "రసికజనమనోభిరామము" వెక్కసమయినది.

అచ్చతెలుఁగు కావ్యములను సరళశైలిలో వ్రాయుటయందుఁ దిమ్మకవి సిద్ధహస్తుడు. అందులో నతనికుండు ప్రత్యేకప్రతిభయే యాయన కవితాధార కొక విశిష్టతను జేకూర్చినది. అతనికి ముందు పదునాఱవ శతాబ్దములోని పొన్నిగంటి తెలగనార్యుఁడుకూడ నచ్చతెలుఁగులో "యయాతిచరిత్రము" వ్రాసినాఁడు. కాని తిమ్మకవి "యచ్చతెలుఁగు రామాయణ, నీలాసుందరీపరిణయము"లకు వచ్చిన ఖ్యాతి దానికి రాలేదు.

తెలుఁగువారి సంప్రదాయములను జాఱవిడువకుండ, నొడుదొడుకులు లేని కవిత్వ మచ్చతెలుఁగులో నడపి యాంధ్రప్రజానీక ప్రశంసలందుకొనిన యానాఁటి తెలుఁగుకవి తిమ్మన సర్వధా శ్లాఘ్యుఁడు; ధన్యుఁడు. అతని నిండు తెలుఁగుఁదన మతని శతకములలో బాగుగాఁ బ్రస్ఫుటమగుచున్నది.

# కుక్కుటేశ్వరశతకము

## పీఠిక

అతని కుక్కుటేశ్వర శతకము తెలుఁగుసీమలో జాలకాలముగాఁ బ్రచారములో నున్నది. ఇది వేణుగోపాల, రామలింగేశాది శతకములవలె నా కాలమునందలి సంఘదురాచారములను, ప్రభువుల యవినయప్రవర్తనలను నిర్దాక్షిణ్యముగా ఖండించుచున్నది. అట్టి శతకములను గవులు స్వానుభవమును బురస్కరించుకొని చెప్పుటచేత, నా రచనలలోని యావేగము, నావేశము, కావ్యలక్షణములనుగూడ నతిక్రమించుట సహజము. అట్టి సందర్భములలో శబ్దములు దూకుడుగా దొర్లుకొని వచ్చు ధోరణిలోఁ గవిత నడచును. జుగుప్సాంశములుకూడ కృతిముఖముగా బట్టబయలగును. అట్టివానిని పరిష్కర్తృమహాశయులు సంస్కరించి ప్రకటనార్థము చేయుటకు తంటాలు పడినను, తత్సహజస్వరూపమును కవిహృదయమును దాఁపలేక పోవుచున్నారు. ఏలాటి నిశితబుద్ధిగల పాఠకుఁడైన, నట్టి పట్టులలో "నిది కవ్యుద్దిష్ట శబ్దము కా"దని వెంటనే కనిపెట్టగలఁడు. తిమ్మకవి కుక్కుటేశ్వర శతకములోఁ గూడ నట్టి పట్టులున్నవి.

ఈ శతకమునకుఁ దిమ్మకవి తన "రుక్మిణీపరిణయము"లోనే యీ క్రింది పద్యముతో నంకురార్పణము చేసినాఁడు.

> "చిన్నివెన్నెలతేఁడు చెన్నైన సికపువ్వు, పసమించు పులితోలు పట్టుసాలు,
> చిలువల యెకిమీఁడు బలు మానికపుఁ దాళి, వాటంపుఁ దెలిగిబ్బ వారువంబు,
> గఱికి పూజల మెచ్చు గారాబు కొమరుండు, వలిగొండ కూతురు వలపుటింతి,
> జేజే తుటుములెల్లఁ జేరి కొల్చెడు బంట్లు, నునువెండి గుబ్బలి యునికిపట్టు,
> నగుచుఁ జెలువొంద, భువనంబు లనుదినంబు రమణఁ బాలించు నిన్ను నేఁ బ్రస్తుతింతు
> బుధనుతవిలాస, పీఠికాపురనివాస కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!"

ఈ పద్యములోని కడపటి రెండు చరణములే కుక్కుటేశ్వరశతకమునకు మకుటమయినది. దీనినిబట్టి తన యిష్టదైవమైన కుక్కుటేశ్వరునికి తన కృతులన్నియు నంకితము చేయుటతోఁ దృప్తిపడకుండ నొక శతకమే యా దేవుని పేర వ్రాయ నెంచినాఁడనియు, దానికి రుక్మిణీపరిణయములోని పై పద్యాంత చరణద్వయమే యందమైన మకుటముగా స్వీకరించినాఁడనియుఁ దెలియుచున్నది. కాని పై పద్యములోని 'బుధనుత' యనునది, శతకములో "భూనుత" యని మాఱి యున్నది. ఇది యసలు కవికృతమే యయి యుండును.

ఇఁక శతకములోని విశేషములనుగూర్చి కొంచెము పరిశీలించుట యవసరము.

ఇందు పద్యములు 92 మాత్రమే. వాని వివరణము:

- దేవతాస్తుతి 24 పద్యములు
- స్వవిషయము 1 పద్యము
- పంచాక్షరీ మహిమ 1 పద్యము
- ఖల లోభులు 12 పద్యములు
- సుజనులు ఘనులు 6 పద్యములు

- సుకవి కుకవులు 4 పద్యములు
- సుశీలా దుశ్శీలలు 5 పద్యములు
- పామరజనులు 10 పద్యములు
- కలిమిలేములు 2 పద్యములు
- సత్ప్రభు దుష్ప్రభులు 2 పద్యములు
- దాతలు సప్తసంతానములు 2 పద్యములు
- సామాన్య నీతులు 12 పద్యములు
- కలికాల మహిమ 2 పద్యములు

ఈ విషయవిభాగములవలన, కవి యప్పటి సాంఘిక పరిస్థితుల నన్నింటిని సులభముగా నవగాహనము చేసికొని పాఠకుల కన్నులకు కట్టిన ట్లెట్టయెదుట ప్రత్యక్షము చేసినట్లు గోచరించుచున్నది..

ఇందులోఁ గల తెలుఁగునాటి దైనందిన వ్యావహారిక శబ్దములు నుపమానములు-

ముకుదాడు, బొల్యావు, పోట్లావు, ఎగదొబ్బు, తిండిపోతు, కక్కూర్తి, గొగ్గిపుట్టు, గగ్గెర్లు, గాజుపూస, నల్లబొట్టు, సుద్దపల్లె, తిర్నామాలు, పరగళ్లు, కుంటెనలు.

అద్భుతజాతీయములకు, నానుడులకు నీ శతకము నిధివంటిది.

(1) కడుగైన తవుడైన, (2) మాడైన మక్కైన, (3) తప్పుదండుగలు, (4) గొల్లసుద్దులు, (5) బాపన పిసాసులు, (6) నాబంటుకొడుకు, (7) ఎగరాసి దిగరాసి, (8) కాయకసరైన, (9) సల్లమ్మి సవకమ్మి, (10) తమలంబు తుక్కు, (11) పల్లకికుక్కి, (12) పటాపంచలు, (13) సందడి తీర్చు, (14) కీల్గంటు పువ్వు, (15) సానకింది వన్నె, (16) జగడాల చీలి, (17) పేసాల పెల్లి, (18) చెరపన చేట.

లోకోక్తులు, ఉపమానములు నుక్తవిషయముల కలికినట్లు కూర్చుటలో నీ శతకకారుఁడు కడుంగడు దిట్ట. కొన్ని యీ క్రింద కాననగును:

(1) పాడింట ఇడిన దీపము, (2) షండున కబ్బిన చాన, (3) కోతి కొదవిన కొబ్బరికాయ, (4) రాతిని నార దీయవచ్చు, (5) గాలిపోగిడి మూటగట్టుట, (6) కోతికి బంగారు గొలుసు, (7) జొన్నఁబడు గ్రుడ్డియెద్దు, (8) కయ్యంబునకు కాలుదువ్వు, (9) మంగలి చేతి దర్పణములు, (10) తృణహుతాశనములు, (11) తలకొట్లఁ బడుట, (12) కొండతో తగరు డీకొనుట.

ఇవిగాక, (1) రాజ్యాంతే నరకం ధ్రువమ్, (2) జాతస్య మరణం ధ్రువమ్, అను నార్యవచనములు నటనటఁ గాన్పించుచున్నవి.

సంస్కృత గ్రంథములలోని భావములుగూడ నీ శతకములో నక్కడక్కడ నగపడుచున్నవి:

"అంబోధి కభిషేక మాచరించిన యట్లు, గంగకుఁ బాద్య మొసంగినట్లు,
మేరువునకు నలంకారంబు లిడినట్టు, లినునకు నారతులెత్తినట్లు,
మలయాచలమునకు గలప మిచ్చినయట్లు ఇల వసంతునకుఁ బూ విడినయట్లు
భూపముఖ్యునకుఁ దాంబూల మిచ్చినయట్లు సోమున కద్దంబు సూపినట్లు
నిఖిలలోకైకభర్తకు నీకు నొక్క బిల్వదళ మార్యవర్యు లర్పించుచుండ్రు"

ఈ పద్యభావము సౌందర్యలహరిలోని

"ప్రదీపజ్వాలాభి ర్దినకర నీరాజనవిధి

స్సుధాసూతే శ్చంద్రోపలజలలవై రర్ఘ్యరచనా,

స్వకీయై రంభోభి స్సలిలనిధి సౌహిత్యకరణం

త్వదీయాభి ర్వాగ్భిస్తవ జనని వాచాం స్తుతిరియమ్"

అను శ్లోకభావమునకు ఛాయ; కాని పద్యములో, 'బిల్వదళార్పణము', శ్లోకములో 'స్తుత్యర్పణము' ప్రసక్తమైనది. "సుధాసూతే శ్చంద్రోపలజలలవై రర్ఘ్యరచనా" యనునది తెలుఁగులో "సోమున కద్దంబు సూపినట్లు" అనుటచేత సంపూర్ణభావము రాలేదు. తక్కినవానికి ప్రజలర్పించు నౌపచారిక వస్తుసముదాయము సమృద్ధిగా నున్నప్పు డట్టి యౌపచారికము పరిహాసాస్పదమని భావము. ఆ రీతిగాఁ జంద్రునికి సమృద్ధిగా నుండు వస్తువు (అతని చేతనే ద్రవీకరింపఁబడిన) "చంద్రోపలజలం" మూలశ్లోకములో సూచితము. ఆ స్థానమును తెలుఁగుపద్యములోఁ గవి "యద్దము"న కిచ్చినాఁడు. ఇది ప్రక్రమభంగమే కాకుండ భావపుష్టికిని గించిన్న్యూనము.

"శతవత్సరంబులు జనులకు నాయు, వంబుజాసనుఁడు మర్యాద చేసె"

యను పద్యము "ఆయుర్వర్ష శతం" అను శ్లోకభావమును బుడికిపుచ్చుకొనినది.

"నదులలో జాహ్నవి, నరులలో విప్రుండు, గ్రహములలోనఁ బంకజహితుండు,

తృణములలో దర్భ, మృగముల సింగంబు, వ్రతముల ద్వాదశి, లతల జాజి,

దానమ్ములం దన్నదానమ్ము, లోహజాతమ్ములలోనఁ గార్తస్వరంబు,

గిరులలో మేరువు, పురములలో గాశి, తరువుల రావి, సంతతులఁ గృతియు"

అను పద్యభావము, భగవద్గీతలలోని విభూతియోగ శ్లోకముల లోనివి.

- నదులలో జాహ్నవి (స్రోతసామస్మి జాహ్నవి)
- నరులలో విప్రుఁడు (నరాణాం చ నరాధిపం) "నరాధిపం" అను ముక్కకు విప్రుండు అని వ్రాయుట జాత్యభిమానమునకు సూచన.
- గ్రహములలోనఁ బంకజహితుండు (జ్యోతిషాం రవిరంశుమాన్)
- మృగముల సింహంబు (మృగాణాం చ మృగేంద్రోఽహం)
- గిరులలో మేరువు (మేరుశ్శిఖరిణా మహం)
- తరువుల రావి (అశ్వత స్సర్వవృక్షాణాం)

**అనుకరణములు**

ఈ కుక్కుటేశ్వర శతకము నొరవడిగా నుంచుకొని వంకాయలపాటి వేంకటకవి "కోలంక శ్రీమదనగోపాలశతకము"ను రచించినాఁడు. ఎత్తుగడలుగూడ "ఘక్తు కాపి".

- ‘గురుతర కౌండిన్యగోత్ర పవిత్రుడ’ (కుక్క)

  ‘గురుకర గౌతమగోత్ర పవిత్రుడ’ (కోలం)
- ‘దండ ముద్దండ దోర్దండ విఖండిత’ (కుక్క)

  ‘దండంబు దోర్దండ మండిత కోదండ’ (కోలం)
- ‘కాకంబునకు రత్న ఖచిత పంజరమేల?’ (కుక్క)

  ‘ముసిఁడి తుప్పలకు గొప్పలు త్రవ్వగానేల?’ (కోలం) (ఇట్టి పద్యాలు కో.మ.గో. శతకములో మూఁడున్నవి.)
- ‘భోగియై ప్రతిదినత్యాగియై పుణ్యసంయోగియై సుజనానురాగి యగుచు’ (కుక్క)

  ‘జారుఁడై దుష్టప్రచారుఁడై, పాపవిదూరుఁడై బహుదురాచారుఁ డగుచు’ (కోలం)
- ‘ఘూకంబు తెఱఁగున గొందుల నిఱుకుచు భుజగంబు చాడ్పున బుస్సుమనుచు’ (కుక్క)

  ‘కడుపిశాచరీతి నెడపక భక్షించి గ్రామసూకరమట్లు కడుపు పెంచి’ (కోలం)
- ‘ఎనుఁబోఁతునకు విద్దెలెన్నింటి నేర్పిన మడుఁగున కేఁగుట మానఁగలదదె?’ (కుక్క)

  ‘ఏపి నందలముపై కెక్కించినను గ్రిందికురవడి పుల్లెల కుఱకకున్నె?’ (కోలం)
- ‘అలికులవేణి సింహకిశోరనిభమధ్య, పరిపక్వబింబోష్ఠి పద్మగంధి,

  రాకేందువదన శరచ్చంద్రికాహాస కోకిలకలవాణి కుందరదన

  పల్లవపాణి శంపాలతావిగ్రహ లికుచవక్షోజ నాళీకనేత్ర

  ముకురకపోల చంపకపుష్పసమనాస భుజగరోమావళీ పులినజఘన’ (కుక్క)

  ‘కులుకుమిటారి పూవిలుతుచేతికటారి, బంగరుబొమ్మ, కప్రంపుదిమ్మ,

  యన్నుల తలమిన్న, చిన్ని సంపెఁగగున్న, గోములనడుదీవి, గుజ్జుమావి,

  వెన్నెల దొంతి మవ్వంపు పువ్వులబంతి, రతనాల తేట, వరాల మూట,

  పండువెన్నెలసొరు బలమానికపు తీరు, వలపుల మొక్క మేల్తరపు చుక్క’ (కోలం)
- ‘జగడాల చీలి, పేసాల పెల్లి, పిసాళి, తిండిపోతు, గయాళి, మొండికట్టె,

  హేయభాజనము, పల్మాయల పుట్టిల్లు, గంతులరాకాసి, పంతగత్తె,

  యవలక్షణము తావు, నవివేకముల ప్రోవు, చెఱపన చేట, మాసికల మూట,

  నిక్కులబండి, బందెలమారి, కల్లలపాఁతఱ, సోమరిపోఁతనంగ’ (కుక్క)

  ‘పలుగుగయ్యాళి, దెబ్బలగండు పలుగాకి, మాలుఁగఁబోతు, బల్మాయలాఁడి,

  పిసినిగొట్టు, పిసాళి, పెంకె, బొంకుల పుట్ట, చెడుగు నిక్కులయిక్క, చెనఁటిమంకు,

  టకుబాజు, కల్లరి, టాటోటు, గడుమోట, బందెల పుట్టిల్లు, నందగత్తె,

  ఱంకులరాటంబు, రవ్వలమారి, తంటాకోరు, రంతులరావు ముచ్చు’ (కోలం)
- ‘వలవని చెలువతో మెలఁగువాఁ డొకకూళ, వాసి డించి చరించువాఁడు కూళ,

  సిరిగల్గి కుడువక చిక్కువాఁ డొకకూళ, వనిత కుంకువ చెప్పువాడు కూళ,

చెడి బంధునింటికిఁ జేరువాఁ డొకకూళ, వసుధేశు చెడనాడువాడు కూళ,
ధనికుతోఁ బగఁ బెట్టుకొనెడువాఁ డొకకూళ, వడిలేని దొర కొల్చువాఁడు కూళ' (కుక్కు)
'తనుఁ దాను నుతి జేసికొనెడువాఁ డొక మూర్ఖు, వలదన్న పని చేయువాడు మూర్ఖు,
పలుగు పెండ్లాముఁ జేపట్టువాఁ డొక మూర్ఖు, పాడి చెప్పఁగఁ బూనువాఁడు మూర్ఖు,
తనకన్న ఘనుఁడు లేడనెఁడువాఁ డొక మూర్ఖు, వనితకు జనవిచ్చువాఁడు మూర్ఖు,
కొఱగానివారల గూడువాఁ డొక మూర్ఖు, పలుగాకివలె పేలువాఁడు మూర్ఖు' (కోలం)

- 'పరమలోభిని దివాకరతనూభవుఁ డంచు, ఛద్మచిత్తుని హరిశ్చంద్రుఁ డనుచు
నిర్దయాత్ముని రామనృపశిఖామణి యంచుఁ, గడుకురూపిని రతికాంతుఁ డనుచుఁ
బాపకర్ము నభంగపాండవాగ్రజుఁ డంచు, సమరభీరుని సవ్యసాచి యనుచుఁ
గుండబీదను మరున్మండలేశ్వరుఁ డంచు, మతివిహీనుని భోగిపతి యటంచు
కవులు కక్కూర్తి నిసుమంత కడుపు కొఱకుఁ బొగడుచుందు, రవివేకబుద్ధులగుచు' (కుక్కు)
'కుక్షింభరుని బుధరక్షాపరుండంచు నతినికృష్టుని మహాత్యాగియంచు
బహుబీజసంభవుఁ బరమపావనుఁ డంచుఁ జంచలాత్ముని ధైర్యశాలియంచు
దౌర్జన్యకారిని ధార్మికోత్తముఁ డంచుఁ గఠినచిత్తుని దయాకరుఁ డటంచు
జారకర్ముని పరదారవర్జితుఁడంచు నుత్తమూఢుని శాస్త్రవేత్తయంచు
గవులు కక్కూర్తి చేతను గడుపుకొఱకు సన్నుతింతురు మదిలో విచారపడక' (కోలం)

తిమ్మకవికి దాదాపు 80 యేండ్ల తరువాతివాఁడయిన యీ వంకాయలపాటి వేంకటకవి, శబ్దములను మార్చినాఁడు; కాని భావచౌర్యము పూర్తిగాఁ గుక్కుటేశ్వరశతకమునుండి చేసిన ట్లతని కోలంక శ్రీమదనగోపాలశతకమువలన తెలియుచున్నది.
తిమ్మకవి రాజులను నిరసించుచు పలికిన పలుకులు గమనింపఁదగినవి.

- 'నిక్కి మిక్కుటమైన యా దొక్కి బొక్కి టక్కరి నృపాలకుల కీర్తి దక్కునొక్కొ?'
- 'కాని దుర్మతులై ప్రజఁ గలఁచి ధనము గూర్పఁ జూతురు బేలలై కూళదొరలు'
- 'రాజ్యమేలంగఁ గలవాఁడె రాజు గాక హీనమతియై చరించువాఁడేటి రాజు?'
- 'తనరు క్రూరనృపాలకాధముల నమ్మి సిరుల కాసించు వాఁ డొక్క చెనటిగాఁడె?'
- 'ధర్మమతి తొట్టు సీ! యిట్టి దుర్మదాంధ నృపకులాధము లేరి కేమియ్యగలరు?'
- 'విత్తంబు గూర్చుట విమలప్రచారమా?, బహునిధుల్ గావఁడె భైరవుండు,
ప్రజల దండించుట పరమసంతోషమా? ప్రాణుల నెల్ల నేఁపఁడె జముండు,
దొరతనంబున కివి గావు వరుసలరయ సాహసౌదార్య ఘనపౌరుషములు గాని'
- 'గాక తన పొట్టకై ప్రజఁ గలంచు దురితరతుఁడు వాఁడొక్క రాజా, తరాజు గాక?'
- 'రాజగునె జాగ్రదురుదురాగ్రహము చేతఁ బ్రజల బాధించు ఘోరదర్పధ్వజుండు'

కుకవులను ఇతడు తెగడిన విధము చూడుఁడు-

➢ 'తస్కరుల చందమునఁ బదార్థములు మ్రుచ్చిలించుచుఁ జూపించు కుకవుల నెంచనేల?'

➢ 'కూడదనఁగను గవితలఁ గూర్చి బలిమిఁ గుమతులకు నిచ్చువాఁడొక కూళ సుమ్ము'

కుక్కుటేశ్వరశతక భావములు వేణుగోపాలశతకములోఁగూడ నక్కడక్కడఁ గనిపించుచుండినను కొంగ్రొత్త పోకడలు లేకపోలేదు.

"కాపు కవీశ్వరుల్, కంచర యోగులు, సాతాని వైష్ణవుల్, సాలె భటులు,

గోమటి దాతలు, కొంటె భాగోతులు, మాల వెజ్జులం, బోయ మావటీలు,

గొల్ల పౌరాణికుల్, పల్లె దైవజ్ఞులు, బానిస వేశ్యలు, జైన బాప

లాఁడుఁ దీర్పరు, లుగ్రయవన ధరాధీశ్వరులు, వైదిక ప్రధానులును…" (కుక్కు)

(ఛాయ-)

"నంబికవిత్వంబు, తంబళజోస్యంబు, వలనొప్పు కోమటి వైష్ణవంబు,

వరుసనే యుప్పరవాని సన్న్యాసంబు, తరువాత శూద్రసంతర్పణంబు,

రజకుని గానంబు, రండా ప్రభుత్వంబు, వెలయంగ నఱవల వితరణంబు,

సాతాని విద్వాంసశాస్త్రవాదము, వేశ్య తనయుఁ డబ్బకుఁ బెట్టు తద్దినంబు" (వేణుగోపాల)

తిమ్మకవి "కుక్కుటేశ్వరశతక"మే తరువాత వచ్చిన నీతి (సీస) శతకముల కన్నింటికి మార్గదర్శకమైనది. అట్టి శతకములలో విషయగౌరవమునుబట్టి, భావబాహుళ్యమునుబట్టి వేణుగోపాలశతకమున కగ్రతాంబూల మీవలసివచ్చును.

తిమ్మకవి క్రీ.శ. 1729 సం॥న రచించిన మఱియొక శతకమైన భర్గశతకము సమగ్రముగా నుండ, నీ కుక్కుటేశ్వర శతకములో మాత్ర మెనిమిది పద్యములు తక్కువగా నున్నవి. ఇప్పటివఱకు దొరకిన ప్రాఁత ముద్రితప్రతులన్నిటిలోను నీ లోటు ఒకేవిధముగఁ గన్పించుచుండుట వలనఁ గవి వ్రాసినవే 92 పద్యములని యూహింపవలసియున్నది. పైగా కుక్కుటేశ్వరశతకములోని కడపటి పద్య మీ యూహను బలపఱచుచున్నది. ఏవో యొకటి రెంటిలోఁ దప్పఁ దన కృతులన్నిట కట్టకడపట, వాని రచనాకాలమును, మంగళాచరణమును దిమ్మకవి విధాయకముగా వ్రాయువాఁడు. భర్గశతకమునఁ గూడ 100, 101 సంఖ్యలుగల పద్యములలో నీ 'రివాజు' పాటించినాఁడు. "కుక్కుటేశ్వరశతకము"లోని 92 న పద్యము" శివశివా! ధాత్రి దా వలచిన వధూటిఁ బాయు వెత వద్దు సుమ్మెట్టిపలువకైన" యని పురుష విరహమునుగూర్చి చెప్పునది. అందుచేతఁ దక్కిన యెనిమిదింటినిగూడ రచించు నుద్దేశముండియుండుననుట సబబు. అట్లు పూర్తి చేయకుండుటకుఁ గారణ మొక్కటే తోఁచుచున్నది.

ఈ కుక్కుటేశ్వరశతక మకుట నిర్మాణము క్రీ.శ. 1715 నాఁటి కే (వెలువడిన) తన రుక్మిణీపరిణయములోనే కవి చేసినాఁడు. ఆనాటినుండి తన యవసానదశ వఱకు స్వానుభవములోని విషయములను బురస్కరించుకొని యప్పుడప్పుడు తనకుఁ దోఁచిన భావములతో 92 పద్యములనే వ్రాయఁగలిగినాఁడు. తక్కిన 8 పద్యములు పూరించులోపలనే యతఁడు మరణించియుండవచ్చును. ఈ నిర్ణయమును దృఢపఱచు నంశములు కుక్కుటేశ్వరశతకములోనే కనఁబడుచున్నవి. అందులో 89వ పద్యము-

"నోరు చేద్దై కూడుకూరలు చవిదప్పు, గడగడ నొడలెల్ల వడఁకుచుండుఁ,

జెవుడున నేమియుఁ జెవులకు వినరాదు, తెగులును జింతయుఁ దగులుకొనును,

కన్నులఁ బొఱగప్పి కానరాదెద్దియు, సిగ్గొకించుకయైనఁ జేరబోదు;

బాలురందఱుఁ గూడి గేలి గావింతురు, మగువలు పకపక నగుచునుంద్రు

మదిఁ దలంపఁగఁ గటకటా! ముదిమి యంత రోఁత లేదుగదా, ధారుణీతలమున"

అని వార్ధకమును గూర్చి తెలుపుటచే నప్పటికిఁ దిమ్మకవి వృద్ధుఁడయి యుండవలెను. ఆ దశలోఁ దన వలన బాగుపడినవారే, తనకుఁ గీడొనర్చునట్లు తరువాతి పద్యములో-

"బావిలోపలఁ బడ్డ పామును వెడలింపఁ జనువాని గఱువక చనఁగఁగలదె?

చిచ్చులోఁ బడెడు వృశ్చికమును వెడలింపఁ జనువాని మీఁటక సడలఁగలదె?

పెనువెల్లిఁ బడి పోవు బెబ్బులిఁ బరికింపఁ జనువాని మింగక చనఁగఁగలదె?

అవనిలోపల ఖలుని నెయ్యంబు మీఱ మనుపఁ జనువానిఁ జెఱుపక మానఁగలఁడె?"

అని తెలిపినాఁడు. లోకవృత్త మెఱిఁగినవారి కిట్టి సంఘటన లాశ్చర్యమును గలిగింపదు. కొంచెము శక్తి యుడుగునప్పటికిఁ దన యాప్తులైనవారు, తన వలన వృద్ధికి వచ్చినవారుకూడ మేలుచేయు మాట యటుండనిచ్చి, విడనాడుటయేకాక, కీడుఁగూడఁ గలిగించుటకుఁ బూనుకొందురు. ఈ విషయములో మానవత్వము బదులు, దానవత్వమే నరజాతి నాశ్రయించును. తిమ్మకవి విషయములో నంతియ జరిగినది. అతని మనస్సునకు సహింపరాని నిర్వేదము కలిగించి యుండుననుటకు పై పద్యమే ప్రబల సాక్ష్యము.

చిట్టచివర 92వ పద్యములో నుటంకింపఁబడిన విషయమును బట్టి చూచిన, నతనికి సతీవియోగముకూడ సంభవించినట్లు తోఁచుచున్నది.

"అన్నంబు నాలుక కరుచియై కనుపట్టు, నిలిచినచో నిల్వ నలవి కాదు,

మనుజేంద్రుతోనైన మాటాడ సైఁపదు, పనులయందేమియు మనసు లేదు,

నడచుచో నడుగులు తడబాటు గైకొను, దగ బందువులనైన నగవు రాదు,

తెవులువుట్టిన రీతి దేహంబు కృశియించుఁ గలనైన నిద్దుర గలుగఁబోదు,

శివశివా! ధాత్రిఁ దా వలచిన వధూటిఁ బాయు వెత వద్దు సుమ్మెట్టి పలువకైన"

ఈ దుస్సహావిరహము చేతనే క్రుంగిపోయి, కవిసార్వభౌముఁడు తన కడపటి జీవితమును కష్టముతోఁ గడపియుండును.

పై పద్యములోని "తా వలచిన వధూటిని" ఎవతెయో 'వాడవదినె'గా మహాత్ముల యశఃకాయమును హత్యచేయుటకుఁ బూనుకొను రసాభాస రసికనామధారులు చిత్రించుటకు ముందు, 'వధూటి' శబ్దనిర్వచనమును దఱచి చూడవలెనని మనవి. సామాన్య జారస్త్రీ విరహమునకైనఁ బై పద్యములో వర్ణితమయిన దురవస్థలన్ని యు నొక్కుమ్మడిగ వివేకవంతుఁడు, పరమేశ్వరభక్తుఁడు, మహాజ్ఞాని, పండితలోకసంభావితుఁడు నైన తిమ్మకవివంటి వానికి తటస్థించి యుండుననుకొనుట పరిహాసాస్పదము. అందులో నఱువది దాటిన వృద్ధుని విషయములో (89 ప. చూడుఁడు) భావించుట వెఱ్ఱితనము, ప్రకృతి విరుద్ధము. ఇక్కడ మఱియొక విషయముకూడ అప్రస్తుతము కాదు.

ఆ పద్యములో "పనులయందేమియు మనసు లేదు" అనుట చేతనే పత్నీవియోగానంతరము "కుక్కుటేశ్వరశతకము" పూర్తిచేయుటకు మనసు పాఱలేదని, యొకవేళ నట్లు పాఱినను, గడపటి పద్యములోని "తా వలచిన వధూటి" -జీవితము- అద్దములోవలెఁ దన కన్నులకుఁ దోఁచునప్పటికి దుఃఖావేగముచేత గంటము సాగక నిలిచిపోయియుండునని దృఢపడుచున్నది.

దీనిని బట్టి తిమ్మకవి క్రీ.శ. 1715లో వ్రాసిన రుక్మిణీపరిణయముతోఁ గుక్కుటేశ్వర శతకము నారంభించినాఁడు. కాని యది తలఁచుకొనినట్లుగ నొక్కనాటిలోఁగాని, లేదా యేవో కొన్ని నాళ్లలోఁగాని వ్రాసినది కాదు. మఱి తన జీవితాంతమువఱకు నప్పుడప్పుడు తోఁచిన భావములను, స్వానుభవవిషయములతో గుదిగ్రుచ్చి వ్రాయుచు వచ్చినాఁడని, ఆ కారణముచేతనే చివరి యెనిమిది పద్యములు నట్లే నిలిచిపోయి, శతకసంఖ్యకు లోపము కలిగినదని నిశ్చయించుట సమంజసము.

## పాఠము

1. సీ	శ్రీకరధవళాంగ, శ్రితజనావనసంగ,
		కరనివిష్టకురంగ, పురవిభంగ,
	తరణిచంద్రరథాంగ, ధరణీతలశతాంగ,
		విదళితానంగ, గోవృషతురంగ,
	వలయీకృతభుజంగ, విలసితఖట్వాంగ,
		ధృతనభోగంగ, వార్నిధినిషంగ,
	మునిమనోంబుజభృంగ, ఘనసమరాభంగ,
		అతిదయాపాంగ, పుణ్యాంతరంగ,
తే	శైలజానుంగ, నీకొక శతక మిపుడు
	కూర్చి యర్పింతుఁ గైకొమ్ము, కోర్కె లిమ్ము,
	భూనుతవిలాస, పీఠికాపురనివాస,
	కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

2. సీ	కొక్కుఁ జొక్కువయాళి జక్కి నెక్కెడి వేల్పు
		మినుసికయెకిమీని యనుఁగుఁబట్టి
	మేల్కడాని పసిండిమేని జేజేమిన్న
		యిద్దఱుతల్లుల ముద్దుఁగొడుకు
	గుజ్జుదేవర ప్రేలుబొజ్జ మేటిమగండు
		మొలకపూవుల పూజ నలరు వలఁతి,
	చిలువజన్నిదముల చెలువుండు సికను లేఁ-
		దొగవిందుతునె పూను సొగసుకాఁడు
తే	నను గజాననుఁ డెపుడు నిన్ బొగడు కృతులఁ
	జిరకృపాస్ఫూర్తి సంపూర్తి సేయుచుండు,
	భూనుతవిలాస, పీఠికాపురనివాస,
	కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

3. సీ గురుతరకౌండిన్యగోత్ర పవిత్రుండ
గంగనమంత్రిశేఖరుని సుతుఁడ
కూచిమంచన్వయాకూపార చంద్రుండ
వితతతావకకృపావీక్షణాప్త-
సత్కలితామహాసామ్రాజ్యభార ధౌ-
రేయుండ బుధజనప్రియ సచివుఁడ
ఘన దెందులూరి లింగన గురూత్తమదత్త
సారశైవాచార సంగ్రహుఁడను
తే తిమ్మకవిచంద్రుఁడను నేను దివిరి నీకు
శతక మర్పింతుఁ గైకొమ్ము సంతసమున,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

4. సీ కౌశిక కౌండిన్య కపిల కశ్యప కణ్వ
కౌత్స కాత్యాయన కలశజులును
జహ్ను జరత్కార జాబాలి జమదగ్ని
జలజభవాత్మజ జైమినులును
మందపాల మతంగ మౌసల మౌద్గల్య
మాండవ్య మైత్రేయ మంకణులును
వల్మీకభవ వత్స వాలఖిల్య వశిష్ఠ
వరతంతు వామదేవ ప్రముఖులును
తే నిక్కముగ నిన్ను వర్ణింపనేర రనఁగ
నెంతవారింక నరులు ని న్నెఱిఁగి పొగడ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

5. సీ దండ ముద్దండదోర్దండకోదండవి-
ఖండిత చండవేదండ, నీకు!
జోహారు హారామరాహారనీహార-

గోహర గోహీరదేహ, నీకు!
నతి శతక్రతుముఖాదితిసుతాతతకృత-
స్తుతికృతామితహిత కుతుక, నీకు!
జేజే పరాజితోగ్రాజివిరాజిత-
వ్యాజనిరీజసమాజ, నీకు!
తే వందన ముదార దారుకావనమునీంద్ర-
సుందరీబృందమానసానంద, నీకు!
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

6\. సీ తపననందన భటోద్దండ చండభుజంగ
మేఘభీషణ విహంగోత్తమంబు
బహుజన్మసంచిత బ్రహ్మహత్యాముఖో-
గ్రౌఘకాలాభ్ర ఝంఝూనిలంబు
భూతవేతాళప్రభూత వాతజ్వరా-
ద్యామయారణ్య దావానలంబు
ఘోరదారిద్ర్యవికారభారోదగ్ర-
వారణానీక కంఠీరవంబు-
తే నైన పంచాక్షరిని భక్తి యతిశయిల్లఁ
దవిలి జపియించు వారెపో ధన్యతములు
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

7\. సీ అమర మస్తకకిరీటాంచిత మనోవిభా-
నీరాజితాంఘ్రిపంకేరుహునకు
శైలకన్యాఘనస్తనవిలిప్తమృగీమ-
దాంకిత విపుల బాహాంతరునకు
గగనతరంగిణీకల్లోలమాలికా-
శోభిత పటు జటాజూటునకును,

మరుదీశనీలోపమానమానిత మహా-
కాకోలరుగ్జాల కంధరునకు
తే	నీకు నతులు సమర్పించి నిష్ఠతోడఁ
గొల్చువారలె శమనుని గెల్చువారు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

8. సీ	అభవు నక్షయు నాద్యు నవ్యక్తు నవ్యయు
ననఘు ననంతు నాద్యంతరహితు
నప్రమేయు నజేయు నకలంకు నసమాను
నానందమయు నాఢ్యు నాత్మరూపు
నచలు ననామయు నఖిలేశు నద్వయు
నార్తరక్షాచణు ననఘుహృదయు
నమలాత్ము నజుగురు ననవద్యు నభయదు
నసహాయు నతిపుణ్యు నగ్రగణ్యు
తే	నహరహంబును నిను భక్తి నాత్మఁ దలఁచు
పుణ్యమతులకుఁ గడు సులభుఁడవు నీవు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

9. సీ	సర్వసర్వంసహాస్థలి శతాంగము గాఁగ
రవిసుధాకరులు చక్రములు గాగ
వాణీవిలాసినీవరుఁడు సారథి గాఁగఁ
బ్రామిన్కుగములు బాబాలు గాగ
రత్నసానుధరాధరము కార్ముకము గాగ
నాగాధినాథుండు నారి గాగ
పంకజాతాక్షుండు కంకపత్రము గాఁగ
బర్హిర్ముఖులు వీరభటులు గాఁగఁ

తే గూర్చి బారులు దీర్చి చిట్టార్చి పేర్చి
యోర్చి పురదానవులఁ దెగటార్చితీవు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

10. సీ రక్షించితివి కదా రవిసూను బడఁదన్ని
చిరకృపామయబుద్ధి శ్వేతకేతు
భక్షించితివి కదా బ్రహ్మాండనివహకో-
లాహలభయద హాలాహలంబు
శిక్షించితివి కదా శితఖడ్గధారాంచ-
లమున దక్షాంధకప్రముఖ ఖలుల
వీక్షించితివి కదా వితతఫాలానల-
జ్వాలచే మరుని భస్మంబు గాఁగ
తే నిగ్రహానుగ్రహప్రౌఢి నీకె కాక
కలదె తక్కిన చిఱుత వేల్పులకు నెల్ల,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

11. సీ పలుకుఁగ్రొన్ననఁబోఁడి కులుకు వీణియ మీట
వేయుఁగన్నులవేల్పు వేణువూదఁ
గలుములతొగకంటి చెలఁగి గానము సేయ
నలువ కైతాళ మింపలర ప్రేయ
మధుదైత్యమథనుండు మద్దెల వాయింప
సకలపారిషదు లెచ్చరికసేయ
నందిభృంగీశు లందంద సందడి దీర్ప
మొనసి దేవతలెల్ల మ్రొక్కి కొలువ
తే సంతసము మీఱఁ గేరి సాయంతనమునఁ
దాండవం బాడు నీ హొయల్ దలఁప వశమె

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

12. సీ అబ్జగర్భునకు లోకానీకనిర్మాణ-
చాతుర్య మేరీతి సంభవించె
జలజాక్షునకు నిశాచరశిక్షణోపాయ-
పాటవం బేలీల నాటుకొనియె
పురుహూతునకు దివ్యభోగభాగ్యాస్పద-
స్వర్లోకపదవి యేసరణి వచ్చె
దిననాథునకు జగజ్జనలోచనదురాప-
ఘనవిభాస్ఫూర్తి యేకరణి నొదవె
తే నహహ తావక పదసరోజార్చనావి-
ధానమునఁ గాదె కలిగె ననూనమహిమ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

13. సీ ధననాయకుడు నితాంతము బ్రియమిత్రుండు
సిరులపైదలిగేస్తుఁ డరిదితూపు
కలధౌతశైలంబు కాఁపురంబు బిడారు
కాంచనాహార్యంబు కార్ముకంబు
రత్నాధివాసంబు రహి మించు తరకసం-
బల సర్వమంగళ యనుఁగురాణి
పంటలపువుఁబోఁడి బాళి మీఱిన తేరు
కళలీను రాజు కీల్గంటిపువ్వు
తే గాఁగ నణిమాది భూతులు గల్గు నీకుఁ
బునుకలెత్తంగ నేరీతిఁ బొసఁగెనయ్య,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

14\. సీ	చెలిమి నోగిర యిడ్డ చిరితొండబత్తుని
కొడుకుఁ జంపించుట దుడుకు గాదె
పరకాంత యని మది నరయక భల్లాణు
నిల్లాలి గోరుట యెగ్గు గాదె
మాలని యెంగిలిమాంసంబు రోయక
తవిలి మెసంగుట తప్పు గాదె
మొనసి యాడుది పంపు పనులకై కినియక
కుంటెనల్ తిరుగుట కొఱఁత గాదె
తే	శివశివా! నీవె యిటువలెఁ జేయునప్పు
డవని నరులకు నింకేమి యడ్డు కలుగు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

15\. సీ	దశశతాబ్దముల నిన్ దవిలి పూజించిన
మెచ్చి చక్రికిఁ జక్రమిచ్చినావు
తరలక నిను గూర్చి తప్పమొనర్చిన క్రీడి
కెసఁగఁ బాశుపతాస్త్ర మొసఁగినావు
మిత్తి చేఁ బడి నిన్ను హత్తి బత్తిఁ దలంచు
మునిపుత్రుఁ జేపట్టి మనిచినావు
కాలకూటాగ్నిచేఁ గ్రాఁగి కుయ్యిడుచున్న
దివిజుల యాపదన్ తీర్చినావు
తే	బళిర జగముల నీవంటి భక్తిసులభుఁ
డైన దైవంబు గలఁడె లోనరసి చూడ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

16\. సీ	పుఱియలు పునుకలు సెఱియఁ బేర్లుగ పైచి
కుత్తుక గరళంబు కుదురు కొలిపి
కడఁగి పెన్బాముల తొడవులుగాఁ బెట్టి

పచ్చియేనుఁగుతోలు పైని గప్పి
నెమ్మేన శవభస్మ మిమ్ముమీఱ నలంది
బికిరంబు చలికూడు ప్రేమఁ దినుచు
భూతపిశాచముల్ ప్రీతిఁ గొల్వగఁ బ్రేత-
భూములయందు నబ్బురము మీఱ
తే మెలఁగుచుండియు భువనమంగళవిలాస-
లీలఁ జెలగుదువంట మేల్ బళీ యయారె!
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

17. సీ జంభాహితుని భుజాస్తంభనం బొనరించి
విష్ణుని చక్రంబు విఱిచి పుచ్చి
బ్రహ్మదేవునిఁ బటాపంచలుగాఁ గొట్టి
భగుని కన్నులు నేలఁబడఁగఁ దిగిచి
పూషార్కు దంతముల్ పొడిపొడిగాఁ దన్ని
సోముని నరకాల భూమిఁ జమరి
దక్షుని తలఁ గొట్టి తవిలి వేల్పులనెల్లఁ
దఱిమి వేఁటాడిన తావకీన
తే వీరభద్రావతార విహారలీలఁ
దలఁచినప్పుడె యాపదల్ తలఁగు నౌర
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

18. సీ బాపని కొక స్వయంపాకాన కియలేక
చుట్టాలకును గూడు పెట్టలేక
పిడికెఁడు బిచ్చ మెన్నఁడు నొసంగగ లేక
కడుపార నన్నంబు గుడువలేక
పైమీఁద నొకగట్టిబట్ట గప్పఁగలేక
నదనునఁ గాసైన వదలలేక

కడుగైనఁ దవుడైన విడిచిపెట్టఁగలేక
మాడైన మక్కైన మానలేక
తే	ఖలుఁడు విత్తంబు గూర్చినఁ గట్టి కొట్టి
పట్టి పుథించి నృపు లరి బలిమిఁ గొంద్రు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

19. సీ	జారచోరులకు గంజాయికల్లులకును
దొత్తుల కగ్గికి దొమ్మరులకు
కుంటెనకత్తెలకును పెలయాండ్రకు
నల్లమందునకు భూవల్లభునకు
తప్పుదండుగలకు దబ్బరగాండ్లకు
నంజుటికిని గోడిపుంజులకును
మందులవాండ్రకు మాలదాసర్లకు
నాటపాటలవాండ్ర కౌను గాని
తే	సుకవిజనదేవతాగృహసూరివరుల
జేరదింతయుఁ దులువ కూర్చిన ధనంబు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

20. సీ	విధవాకుచంబుల విధమున ససి చెడ్డ
పాడింట నిడిన దీపంబు కరణి,
గాననాంతరమునఁ గాయు పెన్నెల రీతి
షండున కబ్బిన చాన పోల్కిఁ
గ్రోఁతి చే నొదవిన కొబ్బరికాయ య-
ట్లంబుధిం బడిన తోయంబు మాడ్కి
ముసిడిఁ బండిన ఫలమ్ముల చందమున దుష్ట-
ఫణిశిరంబున పెల్గు మణి విధమున

తే	ధరణిఁ బరమనికృష్టుని దండనున్న
ధనము వృథయగు నేరికిఁ బనికిరాక,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

21. సీ	వేదశాస్త్రపురాణవిద్య లక్కఱగావు
పరిహాసవిద్యలు పనికివచ్చు
గద్యపద్యవిచిత్రకవితలు కొఱగావు
గొల్లసుద్దుల కతల్ పెల్లుమీఱు
దేవతాభాషల తీరు లేమియుఁ గావు
పారసీకోక్తులు ప్రణుతి కెక్కు
శైవవైష్ణవమతాచారంబు లొప్పవు
పాషండమతములు బాళి నలరు
తే	నౌర యిక్కలికాల మహత్త్వమెంతొ
వింతయై తోఁచుఁ గద ధరాభ్యంతరమున,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

22. సీ	కాపుకవీశ్వరుల్ కంచఱయోగులు
సాతానివైష్ణవుల్ సాలెభటులు
కోమటిదాతలు కొంటెభాగోతులు
మాలవెజ్జులు బోయమావటీలు
గొల్లపౌరాణికుల్ పల్లెదైవజ్ఞులు
బానిసవేశ్యలు జైనబాఁప
లాడుదీర్పరు లుగ్రయవనధరాధీశ్వ-
రులు వైదికప్రధానులును మిగుల
తే	భూతలంబునఁ గలిదోషహేతుకమునఁ
బ్రబలురై రింకనేమి చెప్పంగవలయు

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

23. సీ బొగ్గులఁ దైలంబు బుట్టింపగా వచ్చు
ధట్టించి జలరాశి దాటవచ్చు
జెలరేఁగి ఘనదవానలము మ్రింగఁగ వచ్చు
భుజగులఁ బేర్లుగాఁ బూనవచ్చు
బెబ్బులి నఱచేతఁ బెనఁగి పట్టఁగ వచ్చు
దివిరి ఱాతిని నార దీయవచ్చు
గొదమసింగమును నక్కునఁ జేర్పఁగా వచ్చు
గాలి పోగిడి మూట గట్టవచ్చు
తే గాని తులువల డెందంబు గరగఁ జేయ
వశము గాదయ్య భువిని నెవ్వరికినైన,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

24. సీ సల్లగా మాలదాసర సటారయగారి
తిర్నామములు సాన తేప వింటి
గొల్లమారన బోయ దెల్లఁగా సతికితే
బొల్లేవు పోట్లాటలెల్ల యింటి
జయన యెంకటబొట్లు సబ్బండుసారాలు
పూరాండములు సెప్పఁ గోరి యింటి
సరవయ్య బయలీదు జమిలికతోఁ బాడు
నంకమ్మపాట లెన్నైన యింటి
తే గాని సీ యెద్దుమాంసుల కయితకంబు
లందమనిపించు కాయల యందమండ్రు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

25. సీ అబ్బబ్బ కిందటేఁ డప్పయ్య తీర్థాన
జోలెజంగము కిస్తి నోలెఁడుప్పు
సాతాని జియరయ్య సతికితే వోయిస్తి
కొల్లఁగా గుల్లెఁడు సల్లబొట్టు
లంక సత్తెలవాఁడు వొఁకాన వొగిడితే
మాలదాసరికిస్తి మానెఁడూద
వేదాలు వాగితే యెల్లుబొట్టయ్యకు
కొలకుండ దోసెఁడు కొఱ్ఱలిస్తి
తే నౌర తమకన్న కూసుగాఁ డవల నింకఁ
గలఁడె యను మూర్ఖుఁ డిద్ధరఁ గామవైరి!
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

26. సీ ఆసనబేదంబు లనుకొంటి సేనియా-
డులు సాల రచ్చింపవలెనటంట
కైసవరుఁడనంట నాసారపుసుకుఁడ-
నంట యేధాంతుండనంట పెద్ద-
యెద్దు మారిసుఁడనంట సిద్దాంతుడనటంట
వాసి పేగుల నంటదోసినంట
సోమాదిగులనంట సామిపాకాలంట
సంతుకు తంబులు సతుకుకుంట
తే యెంటఁబట్టిరి యబ్బబ్బ యేమి సేతు
బాపనపిసాసు లనుచోట్ల బలుకఁ దరమె,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

27. సీ మోట బొల్లెద్దుకు ముకుదాడు గట్టిన-
ట్టెద్దెరా మొగమెల్ల సుద్దపట్టె-
లద్దించుకొని వచ్చి అయగారు యేంచేసె

తడియాకుఁ గావలె తయ్యఁడాడు
బళ్ళంట ఆమీఁద పరపామదంట మం-
గలదాని బొందంట గనడమంట
ముత్తి గలుగునంట ముద్రదానము గమ్మ-
టంట దాసరికొయ్య యెంటఁబట్టి
తే పట్టిబుజములు గాలసబట్టినెడు
చెనటుల తెఱంగు లేమని చెప్పనేర్తు
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

28. సీ బోలెఁడు గందంబు బొమలదాఁకా మెత్తి
మెంటెఁ డీబూడిద ఒంట బామి
రుదురాకపేర్లు జన్నిదములు మోఁకాలి
లాపున దిగయేసి యావుపాస-
నానికి నేతిదారైనను దెమ్మంట
దాఁ బల్కునెడ నమేద్యాలటంట
పచ్చాలు మాలయ్యపచ్చాలునుకొంట
సంకలో కబ్బాలు సప్పుకొంట
తే సెడుగుబాపఁడు నాబంటుకొడు కబ్బబ్బ
యెంటఁబడె నను మూర్ఖుల నెన్నదరమె
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

29. సీ బట్టయ్యగాళ్ళంట బబ్బాయువంటను
బొజ్జయుంటనుకొంట బోజనాలు
గావలెనంట తేగాలు దెమ్మనుకొంట
సేరి బూసుండాలు సేసుకొంట
యెల్లనికొడుకంట మల్లనికొడుకంట
పోయిన పెతరుల పొగుడుకొంట

కలయిర్వులెట్టి తొందరగాఁగ దండకాల్
సతకాలు నోకాలు సతుకుకొంట
తే	ఎంటఁ బట్టిరి గదరబ్బ యనెడు మూఢ
కష్టచిత్తుల కిఁక మఱెక్కడి యశంబు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

30. సీ	పాతపొత్తపుకట్ట సేత పట్టుకవచ్చి
దోసిబాపఁడనంట దోసిలొట్టి
జలము సంధ్రుఁడటంట సని సాలదనుకొంట
సెడుగు వాసారులు సెప్పుకుంట
తిండికిఁ దెమ్మంట దేయిరింపుచు తూపె-
తూపెకు సేతులు సాపు గాని
మఱిఁదలెన్నఁడు పెదమనిసైనదంటేను
తప్పక మూత్రంబె సెప్పలేఁడు
తే	సీ యితనికంటె సాకలిసెల్లిగాఁడు
మేలనెడు మోటకొయ్యల సేల దెలుప,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

31. సీ	కరణాలటంటను కైలకట్టల యిప్పి
పాతికలంటను పరిగలంట
కాన్లంట గీన్లంట కలయి లేనియి కొన్ని
సెల్లులు బాకీలు సెప్పుకొంట
బిరబిర గంటాలు గిరగిర దిప్పుతా
నాకులన్నియు నెడ గోఁకుకుంట
యెగరాసి దిగరాసి సగమేసి యెగదొబ్బి
కొంపలు పడదోసి సంపుతారు

తే దయ్యమా కాయకసరైన దక్కనియ్య-
రేమి సేయుదు మను మోటులిలను గలరు
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

32. సీ యెద్దుమందను గూర్చి యెగసాయమిడితేను
తుది నది యధికారి దోసుకొనియె
దాపుదప్పులకంట దర్మకర్చులకంట
కాసువీసము లాగె కరణపయ్య
సల్లమ్మి పవకమ్మి సిల్లర దాసితే
కోమటి నాబంటుకొడుకు దొబ్బె
కళ్ళము కంకులు గాలిఁ బట్టగఁ బోతె
బట్టుబాపనవోళ్ళు బతగనీయ-
తే రహహ దందర మిటులయ్యె ననెడి మోటుఁ
బెద్దదొక్కుడుగాళ్ళఁ జెప్పెడిదిఁకేమి,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

33. సీ కాకంబునకు రత్నఖచితపంజరమేల
పందికి ముత్యాలపందిరేల
యీపిటీఁగకు మేటి తీపుఁదేనియ యేల
శ్వానంబునకుఁ బట్టుజాలరేల
మహిషంబునకు మృగమదవిలేపనమేల
కోతికి బంగారుగొలుసులేల
గర్దభంబునకు బంగారుపల్లంబేల
షండున కందమౌ జాణ యేల
తే పరమలోభికి నృపసభాప్రథితమహిమ-
సుకవికృతభవ్యకావ్యవిస్ఫురణ యేల

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

34. సీ పొడవైన కారెనుబోఁతుఁ గన్గొని తేంట్లు
మదగజేంద్రంబని పొదవునట్లు
దళమైన యెండమావులు సూచి నీళ్ళని
చెలఁగి జింకలు దాడిసేయునట్లు
వలయు దవాగ్నిధూమముఁ గాంచి మొగులని
చాతకంబులు డాయఁ జనినయట్లు
బూరుగచెట్టుపైఁ బూవులుండుట చూచి
చిలుకలు ఫలముకై చేరినట్లు
తే ధరణి నధముల దాంభికత్వములు చూచి
చేరి యాచింపఁ దలతురు సూరిజనులు
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

35. సీ ఇల జొన్నఁ బడు గ్రుడ్డియెద్దు చాడ్పున మృదు-
పదగతు లరయక పరుపుకొనుచుఁ
బెనకున నోడిన పిఱికిబంటును బోలె
వడి లేక ప్రాసంబు విడిచిపైచి
సారెఁ గొక్కెర రీతి జడధుల నెరసుల
నెమకుచు మిగులభంగములఁ దోఁగి
పెంటలపైఁ బొరల్వేట్టు రాసభమట్లు
పలుమఱు నపశబ్దముసె పలుకుచు
తే తస్కరుని చందమునఁ బదార్థములు మ్రుచ్చి-
లించుచుఁ జరించు కుకవుల నెంచనేల?
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

36. సీ దేశాటనంబును దేవతోపాస్తియుఁ
బండితస్నేహంబు బహుపురాణ-
శోధకత్వము పరిశుద్ధతయును మహా-
ప్రతిభయుఁ గల్పనాపాటవంబు
ఛందోముఖాశేషశాస్త్రవేదిత్వంబు
సంగీతసాహిత్యసౌష్ఠవంబు
నిఖిలకలానైపుణియు నహంకారరా-
హిత్యంబు జనహితకృత్యములును
తే గలిగి కవిరాజ రాజశేఖరులు మెచ్చు
కబ్బములు గూర్చువాఁడె పో కవి యనంగ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

37. సీ అలికులవేణి సింహకిశోరనిభమధ్య
పరిపక్వబింబోష్ఠి పద్మగంధి
రాకేందువదన శరచ్చంద్రికాహాస
కోకిలకలవాణి కుందరదన
పల్లవపాణి శంపాలతావిగ్రహ
లికుచవక్షోజ నాళీకనేత్ర
ముకురకపోల చంపకపుష్పసమనాస
భుజగరోమావళి పులినజఘన
తే యనఁగ నెన్నిక గన్న లేయన్నుమిన్న
దొరకి ఘను నిన్ను నుతిగొన్న పురుషుఁ డహహ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

38. సీ పతిని దైవమ యంచు మతి నెంచి యరయుచుఁ
గలనైనఁ గ్రోధంబు నిలుపఁబోక
యతిథులఁ జుట్టాల నతిభక్తిఁ జూచుచు

సత్యవాక్యనిరూఢి జరుపుచుండి
యుభయవంశములకు నుపకీర్తి నించుచు
నిమ్ముగా నగు సుచిత్తమ్ము పూని
యత్తమామల మాట కడుగు దాఁటగఁబోక
మాన మాభరణంబుగా నమర్చి
తే మెలఁగుచుండెడి యిల్లాలు కలుగవలయు
మహితభాగ్యాన్వితుండైన మానవునకు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

39\. సీ తన యింటి యర్థంబుఁ దానె మ్రుచ్చిలుదాని
ననయంబుఁ గొరకొరలాడుదాని
గయ్యంబునకు నెప్డు కాలు దువ్వెడిదాని
నెడపక యేవేళ నేడ్చుదాని
పొరుగిండ్ల వెంబడిఁ దిరుగుచుండెడిదాని
ధట్టించి శిశువులఁ గొట్టుదాని
పరహితశీలయై పరగుచుండెడిదాని
గయ్యాళియై పతిఁ గలఁచుదాని
తే తవిలి పదుగురుబిడ్డల తల్లియైన
విడువవలెనండ్రు పెద్ద లిప్పుడమియందు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

40\. సీ జగడాలచీలి పేసాలవెల్లి బిసాళి
తిండిపోతు గయాళి మొండికట్టె
హేయభాజనము పల్మాయలపుట్టిల్లు
కంతులరాకాసి పంతగత్తె
యవలక్షణముల తా వవివేకములప్రోవు
చెరపనచేట మాసికలమూట

నిక్కులబండి బండెలమారి కల్లల-
పాతర నోమరిపో తనంగ
తే	నెన్నఁబడు బేరజపురండ నేలుచుండు
పురుషుని యభాగ్య మేమని పొగడవచ్చు
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

41. సీ	కిలకిల నగుచు ముద్దులు గుల్కు నొకవేళ
నొకవేళఁ గొరకొరలూని మెలఁగు
మలితవిచారబాములఁ గుందు నొకవేళ
నొకవేళ దృఢపరుషోక్తులాడు
రతికళాకౌశలోన్నతి సూపు నొకవేళ
నొకవేళ మొగమీక యూరకుండు
లలిఁ బెక్కురీతుల లాలించు నొకవేళ
నొకవేళఁ బెనువంత నొందఁజేయు
తే	నౌర వింతలు భూమిపై నాఁడుదాని
మనసు దెలియంగరాదు పద్మజునికైన,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

42. సీ	ఒరుల భాగ్యము సూచి యోర్వఁజాలనివాడు
బుధజనద్వేషంబు పూనువాఁడు
చెలిమిమైఁ దల్లిదండ్రులను బ్రోవనివాఁడు
పరకామినుల కాసపడెడివాఁడు
శివవిష్ణుదూషణల్ సేయుచుండెడివాఁడు
పలుమఱు కొండెముల్ పలుకువాఁడు
భూసుపర్వక్షేత్రములు మ్రింగఁజూచువాఁ
డాడినమాట లేదనెడువాఁడు

తే	ప్రోది చేసినవానితోఁ బోరువాఁడు
చేరు దుర్గతి నిహపరదూరుఁడగుచు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

43. సీ	బహుపుత్రసంప త్తిఁ బ్రబలుచుండెడివారు
నిక్షేపములు ధాత్రి నిలుపువారు
క్షితి శివోద్వాహముల్ సేయుచుండెడివారు
కొంచక గుళ్ళు కట్టించువారు
ఘనతటాకమ్ము లిమ్మొనరఁ ద్రవ్వెడివారు
విరివిగాఁ దోఁటలు వేయువారు
కవిబుధోత్తములకుఁ గామితార్థములిచ్చి
యందంబుగాఁ గృతులందువారు
తే	సప్తసంతానకర్త లీ సదమలాత్ము
లెపుడు నిహపరసుఖముల నెనయుచుండ్రు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

44. సీ	వలవని చెలువతో మెలగువాఁ డొకకూళ
వాసిడించి చరించువాఁడు కూళ
సిరి గల్గి కుడువక చిక్కువాఁ డొకకూళ
వనిత కుంకువ చెప్పువాఁడు కూళ
చెడి బంధునింటికిఁ జేరువాఁ డొకకూళ
వసుధేశుఁ జెడనాడువాఁడు కూళ
ధనికుతోఁ బగపెట్టుకొనెడువాఁ డొకకూళ
వడిలేని దొరఁ గొల్చువాఁడు కూళ
తే	కూడదన్నను గవితలఁ గూర్చి బలిమి
గుమతులకు నిచ్చువాఁ డొక్కకూళ సుమ్ము,

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

45\. సీ ఆరకూటములోన నపరంజి యిడినట్లు
చెరువులోఁ బన్నీరు చిలికినట్లు
చౌటినేలను మంచిసస్యం బిడినయట్లు
వెలిమిడిలో నెయ్యి పేర్చినట్లు
షండున కందమౌ సకిని గూర్చినయట్లు
పేడలోఁ గస్తూరి పెట్టినట్లు
పాడింటిలోన దీపంబు నిల్పినయట్లు
వార్ధిలోఁ గురిసిన వానయట్లు
తే తొడరి సుజనులు ధరణిలో దుర్జనులకుఁ
జేయు నుపకృతి వ్యర్థమై చెడు గదయ్య,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

46\. సీ పరమలోభిని దివాకరతనూభవుఁ డంచు
ఛద్మచిత్తుని హరిశ్చంద్రుఁ డనుచు
నిర్దయాత్ముని రామనృపశిఖామణి యంచుఁ
గడుకురూపిని రతికాంతుఁ డనుచు
పాపకర్ము నభంగపాండవాగ్రజుఁ డంచు
సమరభీరుని సవ్యసాచి యనుచు
కుండబీదను మరున్మండలేశ్వరుఁ డంచు
మతివిహీనుని భోగిపతి యటంచు
తే కవులు కక్కుర్తి నిసుమంత కడుపు కొఱకు
పొగడుచుండుదు రవివేకబుధు లగుచు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

47. సీ పూదోఁటఁ గారెనుబోతు దూఱినయట్లు
పైరులోఁ బెనుగాబు బలిసినట్లు
గుడిమీద మఱ్ఱిమ్రాన్ గుదురు మీఱినయట్లు
చెదపుర్వునకు ఱెక్కలొదవినట్లు
పెరవొప్పఁ జెఱకున వెన్ను పుట్టినయట్లు
తులసిలో గంజాయి మొలచినట్లు
నట్టింట గడితంపుఁ బుట్ట పుట్టినయట్లు
గందమ్ములోఁ బేడ కలిసినట్లు
తే వంగడంబున నొక క్రూరవర్తనుండు
పొడమి తత్ప్రాభవంబెల్ల నుడుగఁజేయు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

48. సీ కాకిమూఁకలలోనఁ గోకిలం బున్నట్లు
కొంగలలో నంచ కూడినట్లు
సైరిభబులలోన సామజంబున్నట్లు
నక్కలలో జింక చిక్కినట్లు
ధుత్తూరములలోనఁ దులసిచెట్టున్నట్లు
ఱేఁచులలోఁ బులి రేఁచినట్లు
గ్రద్దలలో విహంగప్రభుఁడున్నట్లు
ఖరములలో వాజి దొరలినట్లు
తే ధరణిఁ బెక్కండ్రు నీచవర్తనులలోన
ఘనుఁ డొకఁడు చిక్కి యేమియుఁ గాక యుండు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

49. సీ చక్కెరలోఁ బిప్పి సంగతంబైనట్లు
మొగిలిపువ్వున ముండ్లు మొలచినట్లు
మాలి పంటికి జీడి మట్టు మీఱినయట్లు

కనకంబునకు గామ కలిగినట్లు

గొనబుముత్తెమునకు గొగ్గి పుట్టినయట్లు

చందమామకుఁ గందు వొందినట్లు

పాలలోఁ దోడుఁ బాల్ మేళనంబైనట్లు

గంగలోపల నాఁచు గలిగినట్లు

తే ఘనున కొక నేరమించుక కలిగెనేని

గొఱఁతగాఁ జూచి యెగ్గెన్నుకొనరు బుధులు,

భూనుతవిలాస, పీఠికాపురనివాస,

కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

50\. సీ కొఱగాని పంచమకులునైన నడిగించుఁ

బరదేశములవెంటఁ దిరుగఁజేయుఁ

గులములో వన్నె తక్కువయై మెలంగించు

మదిని హింసాంభోధిఁ గుదురుపఱచు

సభ నాడుమాట హాస్యరసాస్పదము సేయు

తెలివి యొక్కపుడైనఁ గలుగనీదు

తివిరి సాధులఁ బట్టి తెరవాట్లు కొట్టించు

గడలేని యిడుమలఁ గుడువఁజేయు

తే ధరణిలోపల నకట పేదఱికమెంత

కాని దది వద్దు సుమ పగవానికైన,

భూనుతవిలాస, పీఠికాపురనివాస,

కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

51\. సీ కులమున కెల్ల మిక్కిలితనం బొనఁగూడు

నాడినమాటయే పాడి యెసఁగు

నిఖిలవిద్యాభ్యాసనిపుణత లభియించుఁ

జేసిన పనులెల్ల వాసికెక్కు

మనుజేశ్వరాస్థానమాన్యత సమకూఱుఁ

గడలేని తేజంబు గలిగియుండు

కవిబుధవందిమాగధుల చెల్మి ఘటించుఁ
బగరయైనను వెంటఁ బడి చరించు
తే గలియుగంబున నబ్బబ్బ కలిమివంటి
మంచివస్తువు కలదె యోజించి చూడ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

52. సీ బంధుజాతములోన బహుమాన మెడలించు
సభలలో మాటాడఁ జనవులేదు
పరమైన విజ్ఞానసరత సిద్ధించదు
కుమతులు గెగ్గెర్లఁ గొట్టుచుంద్రు
పరభూమి కేఁగినఁ బాటింపరెవ్వరుఁ
బ్రతిభావిశేషంబు పట్టువడదు
ధారుణీపతు లొక్కదానమే నొసఁగరు
కులసతి యతనిఁ దక్కువగఁ జూచు
తే నకట విద్యావిహీనత యంత కీడు
లేదు గద మర్త్యులకు ధాత్రిమీఁద నరయ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

53. సీ కడుపార ఘృతమాంసఖండముల్ కడు మెక్కి
పుక్కిటఁ దమలంబు తుక్కు ద్రొక్కి
లావగు గడితంపురీవి గన్గొని నిక్కి
విడువక గేస్తుల మెడలు నొక్కి
కూర్చు రొక్కము చందుగులఁ గ్రిక్కిఱియఁ గ్రుక్కి
కసరుచు జనులపై విసము గ్రక్కి
కవిబుధవరుల ఢాకలకు మూలలఁ జిక్కి
కక్కుచుఁ బల్లకీ కుక్కులెక్కి

తే	నిక్కి మిక్కుటమైన యాదొక్కి బొక్కి-
లో టక్కరి నృపాలకులకీ ర్తి దక్కునొక్కొ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

54. సీ	అనయమ్ము రాజ్యాంతమున నరకము ధ్రువ
మ్మని స్మృతుల్ వచియింప వినఁగలేదొ
మును హరిశ్చంద్రాది మనుజేంద్రు లనఘులై
చనిరన్న సత్కథల్ వినఁగలేదొ
దండధరుండు మీఁదట దురాత్ములఁ బట్టి
పెతఁ బెట్టునను మాట వినఁగలేదొ
మహిలోన జాతస్య మరణం ధ్రువమ్మని
విబుధులు పలుకంగ వినఁగలేదొ
తే	కాని దుర్మతులయి ప్రజఁ గలంచి ధనముఁ
గూర్పఁజూతురు బేలలై కూళదొరలు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

55. సీ	మరుమరీచికలు తామరసపత్రాంతర-
సలిలబిందువులు చంచలలు హస్తి-
కర్ణాంతములు దీపకళికాశిఖలు బుద్బు-
దములు మంగలి చేతిదర్పణములు
మిణుఁగురుఁ బురువుల మెఱపు లభ్రచ్ఛాయ-
లైంద్రజాలికు నాట లంబురాశి-
వీచులు చలదళవృక్షపలాశముల్
తృణహుతాశనముల తెఱఁగు లిట్టి
తే	సిరులు నిలుకడలని నమ్మి చెనఁటు లురక
చెడుదు రెన్నడు ధర్మంబు సేయలేక,

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

56. సీ భోగియై ప్రతిదినత్యాగియై పుణ్యసం-
యోగియై సుజనానురాగి యగుచు
దాతయై బుధజనత్రాతయై నిఖిలవి-
జ్ఞాతయై కుశలసంధాత యగుచు
ధీరుఁడై రణరంగవీరుఁడై నిర్మలా-
చారుఁడై నిరుపమోదారుఁ డగుచు
శాంతుఁడై సదమలస్వాంతుఁడై కీర్తిది-
గంతుఁడై పటుబలవంతుఁ డగుచు

తే రాజ్యమేలంగఁ గలవాఁడె రాజు గాక
హీనమతియై చరించువాఁ డేటి రాజు?
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

57. సీ ఘూకంబు తెఱఁగున గొందుల నిరుకుచు
భుజగంబు చాడ్పున బుస్సుమనుచు
బెబ్బులి కరణిఁ గంపిల డాక సేయుచు
భేకంబు గతి మేనిబెంపు గనుచు
భల్లూకమట్లు చొప్పడ విఱ్ఱవీఁగుచు
నాఁబోతు కైవడి నాముకొనుచు
గోమాయువట్ల యెన్నో మాయ లూనుచుఁ
గ్రోడంబువలెఁ గొరకొర సెగపుచు

తే దనరు క్రూరనృపాలకాధముల నమ్మి
సిరుల కాసించువాఁ డొక్క చెనఁటికాఁడె
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

58\. సీ	కోప మెక్కువ తాల్మి కొఱఁత కార్యము సున్న
నిలుకడ నాస్తి దుర్నీతి ఘనము
కనికరం బిల్ల దుర్గర్వ మగ్గము సత్య-
శౌచముల్ కల్ల మచ్చరము హెచ్చు
కాపట్య మురు వహంకారంబు గాటమ్ము
పొగరు దట్టము ద్రోహబుద్ధి దళము
పరధనాపేక్ష నిబ్బరము లోభము పెల్లు
పరహితచింత నిష్పచ్చరమ్ము
తే	ధర్మమతి తొట్టు నీ యిట్టి దుర్మదాంధ-
నృపకులాధము లేరి కేమియ్యఁగలరు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

59\. సీ	అందలంబెక్కుట యవనిఁ బ్రశస్తమా
మ్రానెక్కి నిక్కదే మర్కటంబు
తొడవులు దొడుగుట దొడ్డసౌభాగ్యమా
కడుసొమ్ము లూనదే గంగిరెద్దు
విత్తంబు గూర్చుట విమలప్రచారమా
బహునిధుల్ గావఁడే భైరవుండు
ప్రజల దండించుట పరమసంతోషమా
ప్రాణులసెల్ల నేపఁడే జముండు
తే	దొరతనంబున కివి గావు వరుస లరయ
సాహసౌదార్యఘనపౌరుషములు గాని,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

60\. సీ	దానవైఖరిని రాధాతనూభవుఁ బోలి
చిరభోగమున శచీవరుని బోలి
కారుణ్యమున రఘుక్ష్మావరేణ్యుని బోలి

సత్యంబునను హరిశ్చంద్రుఁ బోలి
న్యాయమ్ము నందుఁ గౌంతేయాగ్రజుని బోలి
సాహసంబున సవ్యసాచిఁ బోలి
భూరివిద్యాప్రౌఢి భోజరాజును బోలి
హరిభక్తినియతిఁ బ్రహ్లాదుఁ బోలి
తే సర్వసర్వంసహాభుజాధూర్వహుఁడు న-
భంగుఁ డగువాఁడెవో నృపపుంగవుండు
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

61. సీ న్యాయంబు దప్పక నరులఁ గాపాడుచు
వసుమతిఁ బాలించువాఁడె రాజు
దుష్టశిక్ష మహాశిష్టరక్షణ కళా-
వైఖరిఁ జెన్నొందువాఁడె రాజు
కవివందిమాగధగాయకార్థులకెల్ల
వాంఛితార్థము లిచ్చువాఁడె రాజు
శరణని వేఁడిన శాత్రవజనునైన
వదలక చేపట్టువాఁడె రాజు
తే కాక తన పొట్టకై ప్రజఁ గలఁచు దురిత-
రతుఁడు వాఁ డొక రాజా తరాజు గాక,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

62. సీ మరుదనంగుడు శిబి మాంధాత భరతుండు
రంతిదేవుఁడు భగీరథుఁడు పృథుఁడు
శశిబిందుఁడు గయుండు జామదగ్ని దిలీపుఁ
డంబరీషుండు యయాతి దాశ-
రథి సుహోత్రుఁడు పురూరవుఁడు నాభాగుండు
కార్తవీర్యార్జునక్ష్మాపతియును

దుష్యంతుఁ డతని పుత్రుడు నలుండును పురు-
కుత్సుండు మొదలైన కుతలపతులు
తే ధర్మపద్ధతి నిల నేలి తారమైనఁ
గొనక చనుచెల్ల వినరేమొ క్రూరనృపులు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

63. సీ మొదవుల బదివేలు కదుపులు గూర్చిన
దూడ యొక్కటియైనఁ దోడరాదు
మాత లసంఖ్యముల్ మాటుగా నించినఁ
బసిఁడి వీసమును వెంబడిని రాదు
కోకలు మేట్లుగా గొట్ల నిండించిన
గుడ్డ యొక్కటియైనఁ గూడరాము
గొలుసులు రాసులు బలుపాతరల నిడ్డ
గింజ యొక్కటియన గెలన రాదు
తే కావున నొడళ్ళు నిల్కడల్ కావటంచుఁ
జెలఁగి సుజనులు ధర్మంబు సేయుచుండ్రు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

64. సీ కొండంత విత్తంబు గూడఁబెట్టినసైనఁ
బొదలు ధనాపేక్ష వదలిపోదు
స్వర్గాధిపత్యంబు సంభవించిన యేని
బహురాజ్యకాంక్ష యెప్పటికిఁ జనదు
పదివేలు పుత్రులఁ బడసినప్పటికిని
పుత్రోదయభ్రాంతి పోవదెపుడు
చతురంగబలము లసంఖ్యముల్ గూర్చిన
సేనాభిలాష మింతైనఁ దీఱ-

తే	దహహ డెందంబులోపల నంతకంత
నధికమగు నాస యింత కేమి మనఁగవచ్చు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

65. సీ	నిరతాన్నదానవైఖరిఁ జెలంగెడివారు
సెనరొప్ప దీనుల మనుచువారు
గోవిప్రబాంధవగురుభక్తి గలవారు
శివు విష్ణుఁ బూజలు సేయువారు
పరధన పరవధూపరతఁ జెందనివారు
పరహితాచరణులై పరఁగువారు
సుజ్ఞానసహితులై సొబగు మీఱెడివారు
సత్యవచోరూఢి సలుపువారు
తే	తలఁపులోపల ననయంబు ధర్మకార్య-
నిష్ఠ గలవార లందఱు నీకుఁ బ్రియులు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

66. సీ	న్యాయపద్ధతి భూషణము ధరాధిపునకుఁ
బొలఁతికి మానంబు భూషణంబు
శమదమంబులు భూషణములు నిశ్చలునకుఁ
బొసఁగ నింటికి సతి భూషణంబు
నరుని కల్మికి భూషణము దానవైఖరి
భూసురునకు విద్య భూషణంబు
నలినబంధుఁడు భూషణము నభోవీధికిఁ
బుడమికి సస్యంబు భూషణంబు
తే	బుధుల కెప్పుడు నీ పదాంభోజయుగళ-
పూజనాసక్తి వెలలేని భూషణంబు,

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

67. సీ అంభోధి కభిషేక మాచరించినయట్లు
గంగకుఁ బాద్య మొసంగినట్లు
మేరువునకు నలంకారంబు లిడినట్టు-
లినునకు నారతు లెత్తినట్లు
మలయాచలమునకుఁ గలప మిచ్చినయట్టు-
లిల వసంతునకుఁ బూలిడినయట్లు
భూపముఖ్యునకుఁ దాంబూల మిచ్చినయట్లు
సోమున కద్దంబు సూపినట్లు
తే నిఖిలలోకైకభర్తకు నీకు నొక్క
బిల్వదళ మార్యవర్యు లర్పించుచుంద్రు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

68. సీ నడచిపోవఁగ జవం బడరకుండుటఁ జేసి
పుణ్యతీర్థము లాడఁ బోవరాదు
కాసు వీసము చేతఁ గల్గకుండుటఁ జేసి
దానధర్మక్రియల్ తలఁపరాదు
తనువున రుగ్బాధ తరలకుండుటఁ జేసి
స్నానజపాదులు సలుపరాదు
గడితంపుటాఁకలి విడువకుండుటఁ జేసి
యుపవాసములు నిష్ఠ నుండరాదు
తే కాని నిన్నొక్కమాటైనఁ గడఁగి తలఁప-
రాదె యెన్నరు గాక దుర్మతులు మదిని,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

69. సీ శతవత్సరంబులు జనులకుఁగా నాయు-
వంబుజాసనుఁడు మర్యాద చేసె-
నందులో సగమేఁడు లరుగు నిద్రలచేత
శైశవక్రీడల జరుగుఁ గొన్ని
తారుణ్యమున మహామారభూతము సోఁక
నంగనాసక్తిచే నరుగుఁ గొన్ని
వార్ధకంబున బహువ్యాధిపీడలచేతఁ
గడమ యేఁడులు రిత్త గడచుచుండు
తే కటకటా యెన్నఁడును దెల్వి గలిగి నిన్నుఁ
జేరి భజియింపకే ప్రాణి చెడు గదయ్య,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

70. సీ ప్రకృతి గుణంబులఁ బాసి షడ్వర్గంబు-
నడఁచి జితేంద్రియులైన యంచి-
తాష్టాంగయోగక్రియారూఢులై చరా-
చరరూపమగు ప్రపంచంబు మిథ్య
యని తలంచుచు సమస్తాంతరస్థాయివై
నువ్వులలోపల నూనె వోలె
బూసలలో దారమును బోలి యెడపక
నిండారి యుండెడు నిన్ను నెపుడు
తే లోనిచూపునఁ దగఁ దమలోనఁ గాంచి
సోఽహమనువారె సంతతోత్సాహమతులు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

71. సీ వాయుభక్షణ చేసి వనటఁ గుందదె పాము
గుహలలో దూఱదే గూబపులుఁగు
వృక్షశాఖలమీఁద వ్రేలుచుండదె పక్షి

కానలఁ దిరుగదే వానరంబు
చెలరేఁగి కూయదే ఝిల్లికాకూటంబు
గహ్వరి దిరుగదే గంగిరెద్దు
నీట మునుంగదే మాటిమాటికిఁ గప్ప
యాకులు మెసవదే మేఁకపిల్ల
తే యెన్ని తెఱఁగులఁ బొరలుచునున్న నిన్ను
లీలఁ గొలువని ఖలునకు లేదు ముక్తి,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

72. సీ పరుసంబు వలన నబ్బురముగా లోహంబు
మేల్మిబంగారమై మెఱసినట్లు
భ్రమరంబు వలన విభ్రమరూఢి యలరారి
శలభంబు భ్రమరమై చెలఁగినట్లు
మలయభూజాతంబు వలన నింబము పటీ-
రావనీజాతమై యలరినట్లు
కతకంబు వలన నుద్గాఢపంకోదకం-
బతినిర్మలోదకంబైనయట్లు
తే సద్గురుకృపాకటాక్షవీక్షణము వలన
బ్రాకృతుఁడు జ్ఞానియై ముక్తిపదము గాంచు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

73. సీ మణిభూషణములు చామరములు ముత్యాల
గొడుగులు పడిగలు గుజ్జుపరపు
మిద్దెటిళ్ళు మెఱుంగుటద్దముల్ గద్దియల్
చందుగల్ చందువాల్ మందసములు
పూలపాన్పులు శీరతాళవృంతము మేల్
కలపముల్ తూగుటుయ్యెలలు పసిఁడి-

పల్లకీలు గుఱాలు బంట్లు బానిసలును
ధనధాన్య వసన గో దంతి తతులు
తే కులుకుప్రాయంపు ముద్దుగుమ్మలును గలిగి
పొలుచువారలె మును నిన్నుఁ గొలుచువారు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

74. సీ దానహీనుండైన మానవాధము కల్మి
తెరలెడు జంటీఁగ తేనెచుట్టు
చుట్టాల నతిథులఁ జొరనీని ఖలునిల్లు
పెనుబాము వసియించు పెద్దపుట్ట
సభలఁ బ్రసంగింపఁజాలని జనుని ప్ర-
హృష్టసాహితి సానక్రింది వన్నె
పతివాంఛ దీర్పని పడఁతి చక్కదనంబు
కాననాంతరచంద్రికాప్రసక్తి
తే చిత్త మిగురొత్త నినుఁ బూజ సేయలేని
నరుని జన్మము మహిషజన్మము గదయ్య,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

75. సీ కుంభికుంభస్థలాక్షుద్రామిషము మెక్కు
సింగంబు కప్పల మ్రింగఁ జనునె
సారభూరుహఫలాహారలీలఁ జెలంగు
కీర ముమ్మెతలఁ జేరుకొనునె
యభ్రాపగాహాటకాబ్జమృణాళముల్
కొను నంచ బురదవాగులకుఁ జనునె
ప్రబలవర్షాంబుధారలు గ్రోలు వానకో -
యిల యిల మంచుసోనలకుఁ జనునె

తే	ప్రభుభుజానీతభూరివైభవనిమగ్న-
విద్వదవతంస మల్పుల వేడఁ జనునె?
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

76. సీ	అడిగినప్పుడ తన యొడలి చర్మం బూడ్చి
కర్ణుఁ డీయండె యాఖండలునకు
నుడివినప్పుడ యొప్పి పుడమి మూఁడడుగులు
వైరోచనుం డీఁడె వామనునకు
శరణన్న యప్పుడు పరఁగ గువ్వను బ్రోచి
శిబి మేని పొలసీఁడె శ్యేనమునకు
ప్రార్థించినప్పుడే బ్రాహ్మణుఁ గాచి ఖే-
చరుఁడు ప్రాణములీఁడె సురవిరోధి-
తే	కరయ వితరణశూరులైనట్టి ఘనులు
కొంచకేమైన ఘనుల కర్పించుచుంద్రు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

77. సీ	పురుషోత్తమము భద్రగిరి యహోబలము శ్రీ-
శైలంబు వేంకటాచలము కాంచి
సింహాచలంబును శ్రీరంగమును ప్రయా-
గంబు కేదారంబు కాళహస్తి
కుంభకోణంబు శ్రీకూర్మంబు కాశి సు-
బ్రహ్మణ్యమును చిదంబర మయోధ్య
భీమేశ్వరంబును రామేశ్వరంబును
గోకర్ణమును హిమక్షోణిధరము
తే	మొదలుగాఁ గల పుణ్యభూములకుఁ జనఁగ
వలవ దరలేక నినుఁ గొల్చు నలఘుమతికి,

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

78. సీ లవణాబ్ధి లంఘించు పవనాత్మజున కొక్క
తోటకాలువ పూని దాటుటెంత
జగమెల్ల ముంచు వర్షము నించు కాలాంబు-
ధరమున కొకపాదు దడుపుటెంత
బహులోకవాంఛితఫలదమౌ సురశాఖి
కొక యణూపమఫలం బొసగుటెంత
చెడుగు రక్కసిమూఁకఁ జెండు చక్రమునకుఁ
బుడమి నొక్కరుని జంపుట యదెంత
తే సకలబ్రహ్మాండభాండరక్షణకలాభి-
రామునకు నీకు నను( బ్రోచుటేమి వింత?
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

79. సీ నదులలో జాహ్నవి నరులలో విప్రుండు
గ్రహములలోనఁ బంకజహితుండు
తృణములలో దర్భ మృగముల సింగంబు
వ్రతముల ద్వాదశి లతల జాజి
దానమ్ములం దన్నదానమ్ము లోహజా-
తమ్ములలోనఁ గార్తస్వరంబు
గిరులలో మేరువు పురములలో కాశి
తరువుల రావి సంతతులఁ గృతియు
తే నెట్లు పూజ్యములయ్యె నట్లెల్లవేల్పు-
గములయందును నీవె కా ఘనుఁడ వరయ,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

80. సీ నటుని పోల్కి ననేకనామరూపవిభేద-
ములు పూని శుభలీలఁ జెలఁగువాని
తవిలి పూసలలోని దారంబు కైవడి
జగదంతరాత్మయై నెగడువాని
నైంద్రజాలికు రీతి నఖిలంబు నుద్భవ-
స్థితిలయంబుల నొందఁజేయువాని
విపులాంబువులఁ బ్రతిబింబితుండౌ హేళి
వలె సర్వసాక్షియై వెలుఁగువాని
తే నిన్ను సేవింతు భావింతు సన్నుతింతుఁ
బ్రేమ యేపార సాక్షాత్కరింపుమయ్య,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

81. సీ సాలెపుర్వునకుఁ కుంజరమున కహికిని
ముక్తి యొసంగిన భక్తసులభ!
జముని దక్షుని పరాశరతనూజుని గర్వ-
దూరులఁ జేసిన భూరిశౌర్య!
హరి విరించన పురందరుల కఖండపై-
భవము లొసంగిన భువనజనక!
నంది భృంగీశ బాణ దశాననుల మహా-
ప్రమథులఁ జేసిన విమలచరిత!
తే నీ మహత్త్వంబు పూని వర్ణింపఁ దరమె
వాణికి వేయిమోములవానికైన,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

82. సీ ఆరకూటమ్ము బంగారమై యొప్పునే
తగర ముజ్జ్వలకలధౌత మగునె
గాజుపూస యనర్ఘగారుత్మత మ్మౌనె

జిల్లేడు దేవతాక్షితిజ మగునె
కాసరం బతిదర్పకంఠీరవ మ్మౌనె
కాకంబు వరమానసౌక మగునె
మతకరి జోరీఁగ మదపుటేనుఁగ యౌనె
ఘనబిడాలము చిత్రకాయ మగునె
తే రాజగునె జాగ్రదుడు దురాగ్రహముచేతఁ
బ్రజల బాధించు ఘోరదర్పధ్వజుండు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

83. సీ జింక బొడ్డునఁ దావి జిల్లు కస్తురివోలె
జంబాలమున నీరజంబు వోలె
మొరవ మంచిహొరంగుమెఱుఁగువజ్రమువలెఁ
గప్పచిప్పను మౌక్తికంబు వోలె
సరసోత్కరమునందు విరిదేనియలు వోలె
నెండుగడ్డిని గృశానుండు వోలె
వనబిడాలమునందుఁ గన జవాదిని బోలెఁ
బ్రకటింపఁ గృమియందుఁ బట్టువోలె
తే జగతిలోపలఁ గారణజన్ము లొక్క
కానియెడఁ బుట్టియుఁ బ్రసిద్ధిఁ గాంచుచుంద్రు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

84. సీ సిరికిఁ దోఁబుట్టువౌ జ్యేష్ఠామహాదేవి
దీనత నింటింటఁ దిరుగఁజాగె
హరికిఁ గూరిమిపట్టి యగు మకరాంకుండు
మెయిలేక సోకుఁడై మెలఁగుచుండె
మృడునకు గాదిలికొడుకైన వెనకయ్య
యిప్పటికిని బెండ్లి యెఱుఁగఁడయ్యె

నలినాసనునకు మానసపుత్రుఁడైన ద-
క్షుం డుక్కు సెడి తలకొట్లఁ బడియె
తే నిలను దుష్కర్మసహితుల కెట్టి గట్టి
బంధుజనులున్నఁ గీడు వాపంగ లేరు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

85\. సీ గజముపై మహిషంబు కాలు ద్రవ్వెడునట్లు
కొండతోఁ దగరు డీకొనినయట్లు
కార్చిచ్చుపైఁ బతంగము తారసిలునట్లు
మృగరాజుపై నక్క మొగియునట్లు
బెబ్బులితో జింక పెనఁగఁబోయినయట్లు
పెనుబాముపైఁ గప్ప చనినయట్లు
పిల్లితో నెలుక దర్పించి దార్కొనునట్లు
తోడేలితో మేఁక డొడరునట్లు
తే క్రూరు లొక కొంద రసమానవైర మూని
పోరుచుందురు ఘనులతో బుద్ధిమాలి
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

86\. సీ పొద్దుపొద్దుకు వచ్చి పోలిబొట్లయ్య దా
పంచాగమిప్పి ఒప్పన్న సేసి
సాతి బూదారంబు సాతి నచ్చత్తరా
మసిలేటి కారితే యల్లకలికి
గాందారిపొద్దున గాని వర్చీర్జాలు
రావు మీఁదాతులా రాశి నీకు
సూరీడు సందుడు సుకురుండు నని బుర-
స్సపతి పద్దనకొంట సాగినారు

తే	మంచిదని సెప్పి సూకలు మానెఁ డన్ని
కొల్లఁగొనిపోయె నని మూర్ఖకోటి పలుకు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

87. సీ	నింబభూజమునకు నిర్మలోదక మిడి
మనిచినఁ దన చేఁదు మానఁగలదె
పాపకూనకు మంచిపాల్పోసి పెంచిన
నెడరూను తన విషం బుడుగఁగలదె
ఉల్లిగడ్డకుఁ దుషారోదకంబిడి ప్రోది
యిడినను దన కంపు విడువఁగలదె
కందదుంపకుఁ బానకము పోసి పెంచిన
గొదలేని తన దూల వదలఁగలదె
తే	దుర్గుణున కెన్ని మంచి వస్తువులు పెట్టి
మనుపఁ జూచిన తన యోజ మానఁగలఁడె,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

88. సీ	ఎనుబోతునకు విద్దె లెన్నింటి నేర్పిన
మడుగున కేగుటల్ మానఁగలదె
శునకంబునకు నెన్ని సూడిదల్ పెట్టినఁ
బుల్లెలు నాకక మళ్ళఁగలదె
గాడిద కెన్ని సింగారముల్ దిద్దిన
బూడ్దెలోఁ బొరలక పోవఁగలదె
యూరబందికి నెన్ని తీరుల మేపినఁ
బరగళ్ళ కేగక బ్రదుకఁగలదె
తే	హీనుఁడగువాని సత్ప్రభు లెన్నిగతుల
నునిచి మనిచినఁ జెడుజాడ లుడుగఁగలఁడె,

భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

89. సీ నోరు చేఁదై కూడుగూరలు చవి దప్పు
గడగడ నొడలెల్ల వడకుచుండు
జెవుడున నేమియుఁ జెవులకు వినరాదు
తెగులును జింతయుఁ దగులుకొనుచు
కన్నులఁ బొర గప్పి కానరాదెద్దియు
సిగ్గొకించుకయైనఁ జేరఁబోదు
బాలు రందఱుఁ గూడి గేలి గావింతురు
మగువలు పకపక నగుచునుంద్రు
తే మదిఁ దలంపగఁ గటకటా ముదిమియంత
రోఁత లేదు గదా ధారుణీతలమున,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

90. సీ బావిలోపలఁ బడ్డ పామును వెడలింపఁ
జనువానిఁ గరువక చనఁగఁగలదె
చిచ్చులోఁ బడెడు వృశ్చికమును వెడలింపఁ
జనువాని మీటక నడలఁగలదె
పెనువెల్లిఁ బడి పోవు బెబ్బులిఁ బరికింపఁ
జనువాని మ్రింగక మనుపఁగలదె
బురదగోఁతను బడ్డ పోట్లావు లెగనెత్తఁ
జనువాని బొడువక జరగఁగలదె
తే అవనిలోపల ఖలుని నెయ్యంబు మీఱ
మనుపఁ జనువానిఁ జెఱుపక మానఁగలఁడె?
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

91. సీ	ఘనగహనాంతరోద్గతతృణానీకంబు
ధేనువునందుఁ బాలైనయట్లు
వితతదుర్వర్ణరూపితలోహపిండంబు
రసమునఁ బసిడియై యొసఁగినట్లు
సాంద్రాభ్రవారివృషత్కదంబము శుక్తి-
యందు ముక్తామణియైనయట్లు
భూరికుల్యాతకవారి రసాలమూ-
లమునఁ బానకమై చెలంగినట్లు
తే	కరిహయాందోళికారత్నకాంచనాదు-
లగుచు నిజవక్త్రమున నిడ్డ హోర్యమొప్పు,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!

92. సీ	అన్నంబు నాలుక కరుచియై కన్పట్టు
నిలిచినచో నిల్వ నలవికాదు
మనుజేంద్రుతోనైన మాటాడ సైపదు
పనులయందేమియు మనసు లేదు
నడుచుచో నడుగులు తడబాటు గైకొనుఁ
దగఁ బందువులనైన నగవు రాదు
తెవులు పుట్టిన రీతి దేహంబు కృశియించుఁ
గలనైన నిద్దుర గలుగఁబోదు
తే	శివశివా ధాత్రిఁ దా వలచిన వధూటిఁ
బాయు వెత వద్దు సుమ్మెట్టి పలువకైన,
భూనుతవిలాస, పీఠికాపురనివాస,
కుముదహితకోటిసంకాశ, కుక్కుటేశ!